


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162


నారా లోకేష్ రష్యా పర్యటనపై జాతీయ మీడియాలో ప్రత్యేక కథనం




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 154 | బుధవారం 10 - 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


# కేంద్రం మరో బిగ్ షాక్

## ఇకపై ఏడాదికి 4 సిలిండర్లకే సబ్సిడీ!





- ఉజ్వల పథకం కింద సబ్సిడీ సిలిండర్ల సంఖ్యను ఏడాదికి 4కు తగ్గించిన కేంద్రం
- సగటున పేద కుటుంబాలు ఏటా 4 సిలిండర్లనే వాడుతున్నాయని ప్రభుత్వ వర్గాల వెల్లడి
- ఇటీవల సిలిండర్ ధర రూ. 29 పెరిగినా రూ. 300 సబ్సిడీతో లబ్ధిదారునికి రూ. 642కే అందజేత
- అంతర్జాతీయ ధరల పెరుగుదల వల్ల ఒక్కో సిలిండర్‌పై చమురు సంస్థలకు రూ.700 నష్టం
- 2022 నుంచి ఇప్పటివరకు ఎల్పీజీ సబ్సిడీల కోసం రూ.52,000 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడి

## పశ్చిమ బెంగాల్‌లో పార్టీలో సంక్షోభం..



- మమత నాయకత్వాన్ని పొగిడినవారే, ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన
- ఇది అధికారం కోసం చేస్తున్న ద్రోహమని టీఎంసీ చీఫ్ విప్ వ్యాఖ్య
- తృణమూల్ కాంగ్రెస్‌లో తీవ్రమైన అంతర్గత సంక్షోభం
- ఎన్డీఏకు మద్దతిస్తామంటూ 20 మంది ఎంపీల తిరుగుబాటు

## విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన బాధాకరం

ఘటనపై ముగ్గురు నిపుణులతో కమిటీ ఏర్పాటు
బాధితులను పరామర్శించిన డిప్యూటీ సిఎం పవన్



## స్టీల్ ప్లాంట్ బాధితుకలు అండగా ఉంటాం

బాధిత కుటుంబాలకు లోకేశ్ పరామర్శ
అధికారుల నుంచి ప్రమాద వివరాలు ఆరా



## డిజిటలైజేషన్, ఎఐలదే కీలక భూమిక

విద్యార్థులను సవాళ్లకు సన్నద్ధం చేయాలి
టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ సాగాలి
విక్రమ సింహపురి స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల నజీర్ పిలుపు



## దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి
## రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్



- అభద్రతా భావంతో రేవంత్ వ్యక్తిగత ద విమర్శలకు దిగుతున్నారన్న కిషన్ రెడ్డి
- రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు రావాలని సవాల్
- ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్టు నిరూపించినా రాజీనామా చేస్తానన్న కిషన్ రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... అహంకారం, అభద్రతా భావం, తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు.

## వైద్య శాఖలో 5 వేల మంది బదిలీ

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల పర్వం కొనసాగుతోంది. మంగళవారం రాత్రి వరకు మొత్తం 4,867 మందిని బదిలీ చేశారు. ఇందులో అత్యధికంగా ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని 2,258 మంది ఉన్నారు. మరో 500 మంది వరకు నర్సింగ్ సిబ్బందిని బదిలీ చేయాల్సి వుందని ఆ శాఖ వర్గాలు వెల్లడించాయి.



# స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై రాజకీయాలా?

## వైసిపి తీరుపై మండిపడ్డ ఎంపి కలిశెట్టి

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాద ఘటనపై వైసీపీ వ్యవహరిస్తున్న తీరు పట్ల విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. నాడు ఎల్‌జీ పాలిమర్స్ బాధితులను గాలికొదిలేసిన వైసీపీ.. నేడు స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, శాశ్వత ఉద్యోగం ఇచ్చిన మానవతా ప్రభుత్వం ఈ కూటమి సర్కారు అని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పారిశ్రామిక రక్షణ గాల్లో దీపమైతే.. నేడు బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్..

- వివిధ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నిర్దేశించిన సీఎం
- పనితీరు ఆధారంగా స్కోరింగ్ విధానం అమలుకు నిర్ణయం
- ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికల రూపకల్పన
- ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుపై ఆలోచన
- 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం డేటా ఆధారిత పాలనపై దృష్టి

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు, వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) లక్ష్యాలు, ప్రభుత్వ శాఖల పనితీరును కొలిచే కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల (కేపీఐ)పై ఉన్నతాధికారులతో సమీక్ష

# డిజిలైటేజషన్, ఎఐలదే కీలక భూమిక

ప్రస్తుత కాలంలో డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యాసంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ విద్యను విస్తృతంగా వినియోగించాలని తెలిపారు. మంగళవారం నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవ సభకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విశ్వవిద్యాలయం గత పదిహేడేళ్లుగా నాణ్యమైన విద్య, పరిశోధన, సామాజిక సేవల ద్వారా విశేష ప్రగతి సాధించిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం ఇటీవల నాక్ నుంచి 3.23 సీజీపీఏతో 'ఎ' గ్రేడ్ సాధించడం గర్వకారణమని ప్రశంసించారు. ఈ విజయంతో జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానాలను సాధించే సామర్థ్యం విశ్వవిద్యాలయానికి ఉందని తెలిపారు. ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రస్తావించారు. డీప్ ఓషన్ మిషన్ కార్యక్రమం కింద మెరైన్ బయాలజీ విభాగానికి రూ.4.12 కోట్ల గ్రాంట్ లభించడం విశ్వవిద్యాలయ అభివృద్ధికి కొత్త అవకాశాలను కల్పించిందని వివరించారు. ఈ నిధుల ద్వారా పరిశోధన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ విద్య, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మరింత ఊతమిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం చేపడుతున్న జాతీయ సేవా పథకం కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, కాలేజ్– టు – విలేజ్, ల్యాబ్ – టు – ల్యాండ్ వంటి కార్యక్రమాలను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. కరుణ, నిజాయితీ, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను జీవితాంతం పాటించాలని సూచించారు. ఏపీజే అబ్దుల్ కలాం సందేశాన్ని గుర్తుచేస్తూ ప్రపంచానికి మీ అత్యుత్తమ కృషిని అందించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. అప్పుడు ప్రపంచం కూడా మీకు అత్యుత్తమ అవకాశాలు, గుర్తింపు, విజయాలను తిరిగి అందిస్తోందని తెలిపారు. యువత పెద్ద కలలు కనాలని, పట్టుదలతో కృషి చేస్తే ఏ లక్ష్యమైనా సాధించగలరని చెప్పుకొచ్చారు. విద్యే సమాజ మార్పునకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని ఉద్ఘాటించారు. విద్యా రంగం, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించే వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సదస్సులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ జ్ఞానం, నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.

# వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్..

నిర్వహించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కేపీఐలను సీఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే వెనుకబడిన సూచికలను మెరుగుపరచడమే కాకుండా, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. కేవలం నిర్దేశిత లక్ష్యాలే కాకుండా, వాస్తవ వృద్ధి (రియల్ గ్రోత్) ఆధారంగా శాఖల పనితీరును అంచనా వేసేందుకు స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలపై పెట్టే వ్యయం, ఆర్థిక కార్యకలాపాలను 3.5 రెట్లు పెంచేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఆర్థిక వ్యవహారాలను రియల్ టైంలో పర్యవేక్షించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలనే ఆలోచనను కూడా పంచుకున్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్‌పోర్టుల వంటి కీలక ప్రాజెక్టులతో ఆర్థిక వ్యవస్థకు 'మల్టిప్లైయర్ ఎఫెక్ట్' తీసుకురావాలని సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటేనే రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుతుందని, ప్రతి రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంపుపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి అన్నారు.

# దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

"కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లాను. రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణ ప్రజలకు, నా నియోజకవర్గానికి, నా పార్టీకి మాత్రమే నేను జవాబుదారీని" అని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ప్రెస్ క్లబ్ అయినా సరే లేదా అమరవీరుల స్తూపం ముందైనా సరే నేను చర్చకు సిద్ధం" అని ప్రకటించారు. తాను తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా అడ్డుకున్నానని నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని, దీనిపై సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీని వేసి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్–2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు మానేసి, పద్ధతిగా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అవినీతి, తప్పుడు నిర్వహణతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై రాజకీయాలా?

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కాకుండా కాపాడేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అహర్నిశలూ శ్రమిస్తున్నారని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన దురదృష్టకర ప్రమాదాన్ని కూడా రాజకీయ లబ్ది కోసం వాడుకుంటూ, ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న శవరాజకీయాలను ఈ సందర్భంగా ఆయన ఖండించారు. వైసీపీ ఐదేళ్ల తుగ్లక్ పాలనలోని పారిశ్రామిక నిర్లక్ష్యాన్ని గుర్తు చేస్తూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమంతోపాటు స్టీల్ ఎ÷–లాంట్ మనుగడ కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని ఆయన వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఉదంతాన్ని ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వివరించారు. ఆ సమయంలో సీఎం వైఎస్ జగన్ వ్యవహరించిన తీరును ఆయన ఎండగట్టారు. అందుకు భిన్నంగా ప్రస్తుతం కూటమి సర్కార్ స్పందించిందని గుర్తు చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మిక సోదరుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన పరిహారం దేశ పారిశ్రామిక చరిత్రలోనే ఒక రికార్డు అని అభివర్ణించారు.

ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి వివరించారు. ?

ఇంతటి ఉదారతతో కార్మిక లోకానికి అండగా నిలిచిన కూటమి ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి.. వైసీపీ నేతలు సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని ఎంపీ కలిశెట్టి నిప్పులు చెరిగారు. విశాఖ స్టీల్ ఎ÷–లాంట్ ప్రైవేటీకరణను పక్కన పెట్టి.. దాని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను ఎంపీ కలిశెట్టి సోదాహరణగా వివరించారు. ఈఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని ఆయన పేర్కొన్నారు.

# మహిళలు ఎదుగుతుంటే ఓర్వలేని బిఆర్ఎస్

## ఫ్రీ బస్సు తీసుకొస్తే కళ్లల్లో నిప్పులు పోసుకున్నారు

## మంత్రి సీతక్క ఘాటు విమర్శలు

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని కాంగ్రెస్ సర్కార్ కోరుకుంటే బీఆర్ఎస్ ఏడుస్తోందని మంత్రి సీతక్క విమర్శించారు. మహిళలు ఎదిగితే బీఆర్ఎస్ ఓర్వలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఫ్రీ బస్ స్కీమ్ తీసుకొస్తే కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని బీఆర్ఎస్ పై ఫైర్ అయ్యారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ ప్రభుత్వం మహిళా శక్తి సభ నిర్వహించింది. మంత్రి సీతక్క ఈ సభకు హాజరై ప్రసగించారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని తెలిపారు. రూ.2 వేల కోట్ల వడ్డీ డబ్బులను ప్రభుత్వమే చెల్లింస్తుదని చెప్పారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మూడు వేలకు పైగా మహిళా సంఘాలకు ఐకేపీ సెంటర్లు ఇచ్చామని.. వీటి ద్వారా ఆడబిడ్డలకు గతేడాది రూ.159 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో చదువుకోని 12 లక్షల మంది మహిళలకు చదువు చెప్పిస్తున్నామన్నారు. 60 ఏళ్లు దాటిన మహిళలను కూడా మహిళా సంఘాల్లో చేర్చుతున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులను ప్రపంచానికి చూపిస్తున్నామని అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

## మరోమారు కేంద్రానికి లేఖ రాస్తా

## 8 లక్షల మేట్రిక్ టన్నుల మొక్క జొన్న కొనుగోలు

## హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి

## ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహి విమర్శలు

## మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయన్న ఎన్‌డీఎస్‌ఏ

## మీడియా సమావేంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్టాల్లో్ల డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పండించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు.

ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ప్రోక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం ఉందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా పంట సాగవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ ఆబద్దాలేనని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళా సంఘాల అకౌంట్‌లో నగదు వేస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ.170 కోట్లు చెల్లించామని వివరించారు.

8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత బాధ్యతగా కొనుగోలు చేయలేదని చెప్పారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్టాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య అధికంగా ఉందన్నారు.

తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో మూడు బ్యారేజీల టెస్టింగ్ పక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీకు నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్‌ఏ చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టం చేసిందన్నారు. దేశంలోనే రికార్డ్ స్థాయిలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెంగాణలో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయ్యిందని.. యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం కొన్నామని చెప్పారు. రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని.. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డ్ అని తెలిపారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.35,077 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. రైతులకు ఇబ్బంది లేకుండా స్థానికంగా ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ టార్గెట్ పెట్టిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో 61 శాతం తెలంగాణలోనే అవుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని.. రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ధాన్యం కొనుగోలుపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని దుష్ప్రచారం చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీరుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ.. తెలంగాణలో సేకరించినంతా ధాన్యం సేకరించలేదని తెలిపారు. అలాంటి బీజేపీ నేతలు ఇక్కడ యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్షాలు చెప్పేవి అన్ని అబద్దాలేనని మండిపడ్డారు. ధాన్యం విషయంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని పదిసార్లు కలిశామని తెలిపారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని కోరామని.. కానీ కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదని ప్రశ్నించారు. రైతులపై బీజేపీ వైఖరి స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా బాధ్యతగా ధాన్యం కొనుగోలు చేయలేదని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలనే అంశంపై.. దేశంలో వివిధ రాష్టాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో హమాలీల సమస్య ఎక్కువగా ఉందని ప్రస్తావించారు. మోస్ట్ అడ్వాన్స్ మోడరైజేషన్ సిస్టం తేవాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో ఇప్పుడు ఉన్న స్టోరేజ్ సరిపోవట్లేదని తెలిపారు.

# బాసర గోదావరిలో ముగ్గురి గల్లంతు

నిర్మల్ జిల్లా బాసరలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తూ మంగళవారం గల్లంతయ్యారు. సాయంత్రం వారి మృతదేహాలు బయట పడ్డాయి. ఈ ఘటనతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై బాసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కాచిగూడ చప్పల్ బజార్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు బాసరలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనం కోసం ఇవాళ వచ్చారు. దర్శనానికి ముందు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తుండగా ముగ్గురు సోదరులు నీటిలో మునిగిపోయారు. మాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ బృందాలు, గజ ఈతగాళ్లతో రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. కొన్ని గంటల పాటు గాలించాక.. ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు గజ ఈతగాళ్లు. మృతులను చెందిన చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31)గా గుర్తించారు.

# కేంద్రం మరో బిగ్ షాక్..

కేంద్ర ప్రభుత్వం తన ప్రతిష్టాత్మక 'ప్రధాన మంత్రి ఉజ్వల యోజన' (పీఎంయూవై) లబ్ధిదారులకు అందించే సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్ల సంఖ్యపై కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఇస్తున్న సబ్సిడీ సిలిండర్ల కోటాను ఏడాదికి 4కు పరిమితం చేస్తున్నట్టు సోమవారం ఓ ఉన్నత ప్రభుత్వ అధికారి వెల్లడించారు. పేద కుటుంబాల సగటు వాడకానికి అనుగుణంగానే ఈ మార్పు చేసినట్టు ప్రభుత్వం చెబుతోంది. 2016 మే నెలలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా పేద కుటుంబాల్లోని మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందించారు. తొలినాళ్లలో ఏడాదికి 12 సిలిండర్లపై సబ్సిడీ ఇవ్వగా, గత ఏడాది దాన్ని 9కి తగ్గించారు. ఇప్పుడు తాజాగా ఆ సంఖ్యను 4కు కుదించారు. పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ప్రవీణ్ మల్ ఖనూజా మాట్లాడుతూ.. ఉజ్వల లబ్ధిదారుల సగటు వార్షిక వినియోగం దాదాపు నాలుగు సిలిండర్లుగానే ఉందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. శుభ్రమైన వంట ఇంధనాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో, మే 2022లో కేంద్రం ఒక్కో సిలిండర్‌పై రూ. 200 సబ్సిడీని ప్రవేశపెట్టింది. అక్టోబర్ 2023లో ఆ సబ్సిడీని రూ. 300కు పెంచింది. లబ్ధిదారులు సిలిండర్ కొనుగోలు చేసిన తర్వాత ఈ సబ్సిడీ మొత్తం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. ఇటీవల వంట గ్యాస్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ కోత విధించడం గమనార్హం. గత మూడు నెలల్లో రెండుసార్లు ధరలు పెరిగి, ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధర రూ. 942కు చేరింది. రూ. 300 సబ్సిడీ పోగా, ఉజ్వల లబ్ధిదారులు ప్రస్తుతం రూ. 642 చెల్లిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరగడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఖనూజా తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఎల్పీజీ ధరలు విపరీతంగా పెరిగాయని, ఒక్కో సిలిండర్ సరఫరాకు ప్రభుత్వానికి రూ. 1,600 పైగా ఖర్చవుతోందని ఆయన వివరించారు. అంటే, సబ్సిడీ తర్వాత కూడా ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌పై సుమారు రూ. 1,000 భరిస్తోందని పేర్కొన్నారు. ఈ ధరల పెరుగుదల వల్ల చమురు కంపెనీలు ఒక్కో ఎల్పీజీ సిలిండర్‌పై సుమారు రూ. 700 నష్టపోతున్నాయని తెలిపారు. కేవలం ఎల్పీజీపైనే కాకుండా, పెట్రోల్, డీజిల్‌పై కూడా చమురు కంపెనీలు నష్టాలను చవిచూస్తున్నాయని ఆయన అన్నారు. పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 6, డీజిల్‌పై లీటర్‌కు రూ. 30 వరకు నష్టం వస్తోందని, మొత్తంగా రోజుకు రూ. 600–700 కోట్ల నష్టాలు వస్తున్నాయని ధరల పెంపునకు గల కారణాలను వివరించారు. 2022 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం ఎల్పీజీ సబ్సిడీల రూపంలో రూ. 52,000 కోట్లు అందించిందని ఆయన గుర్తుచేశారు. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే, భారత్‌లోనే వంటగ్యాస్ అత్యంత తక్కువ ధరకు లభిస్తోందని అన్నారు.

# పశ్చిమ బెంగాల్‌లో పార్టీలో సంక్షోభం..

పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుత పరిణామాలపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) స్పందించింది. టీఎంసీ చీఫ్ విప్‌గా నియమితులైన కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ, గతంలో మమతా బెనర్జీ నాయకత్వాన్ని ఆకాశనికెత్తిన వారే, ఇప్పుడు పార్టీ అధికారంలో లేదనే సాకుతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది కేవలం అధికారం కోసం చేస్తున్న ద్రోహమని ఆయన ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన సుమారు 20 మంది లోక్‌సభ ఎంపీలు, పార్లమెంటులో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసినట్లు రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ దస్తిదార్ ప్రకటించారు. రాష్ట్రంలో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో అసమ్మతి జ్వాలలు మిన్నంటాయి. ఇప్పటికే 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు పార్టీ అధికారిక శాసనసభాపక్ష నేత అభ్యర్థిని కాదని, బహిష్కరణకు గురైన నేతకు మద్దతు తెలపడం గమనార్హం. తాజాగా ఈ సంక్షోభం పార్లమెంటుకు సైతం పాకింది. పార్టీలో పెరుగుతున్న అవినీతి, సీనియర్ నేతలను విస్మరించడం, మమత కుటుంబ సభ్యుల ఆధిపత్యమే ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణాలని అసమ్మతి నేతలు ఆరోపిస్తున్నారు. పలువురు రెబల్ ఎంపీలు ఇప్పటికే కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్, బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారితో సమావేశమయ్యారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన బాధాకరం

విశాఖ ఉక్కు కర్మాగారంలో మెటల్ లిక్విడ్ లాడిల్ పేలి ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం విశాఖకు చేరుకున్న ఆయన, మొదట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం స్టీల్ ఎ÷–లాంట్ పరిధిలోని ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, యాజమాన్యంతో మాట్లాడారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘోర ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు కోసం ముగ్గురు నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, త్వరలోనే ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న క్షతగాత్రుల వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ పవన్ కల్యాణ్ కీలక ప్యాకేజీని ప్రకటించారు. ప్రమాదంలో మరణించిన రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబాలకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు రూ. 45.75 లక్షల పరిహారంతో పాటు, మృతుల కుటుంబాలకు అదనంగా రూ. 25 లక్షల సహాయం అందజేస్తామన్నారు. అంతేకాకుండా, స్టీల్ ఎ÷–లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఎవరూ నివాసాల గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రతి కార్మికుడు తమ రిటైర్మెంట్ వరకు స్టీల్ ఎ÷–లాంట్ క్వార్టర్స్ లోనే కొనసాగేలా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# స్టీల్ ప్లాంట్ బాధితుకలు అండగా ఉంటాం

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. మంగళవారం ఉదయం కేజీహెచ్ ఆస్పత్రికి చేరుకున్న మంత్రి.. మార్చురీలో ఎంతమంది ఉన్నారనే దానిపై జాయింట్ కలెక్టర్ విద్యాధరిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో చనిపోయిన ఎమినిది మంది బంధువులను పరామర్శించారు. వారి నుంచి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపై సెవెన్ హిల్స్ ఆస్పత్రికి మంత్రి వెళ్లారు. స్టీల్ ఎ÷–లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూరిబాబు, పైడిరాజు, పి.శ్రీనివాసరావు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని, ఆసుపత్రిలో అందుతున్న చికిత్సను వైద్యులను అడిగి తెలుసుకున్నారు . అనంతరం గాయపడిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని లోకేశ్ చెప్పారు. మంత్రి లోకేశ్‌తో పాటు కేంద్రమంత్రి భూపతి రాజు, హోంమంత్రి అనిత, ఎంపీ భరత్, పల్లా శ్రీనివాసరావు.. వాసంసెట్టి బాధితులను పరామర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరిగింది. లాడిల్ నుంచి ద్రవ ఉక్కు బకెట్లు కింద పడిపోయాయి. పలువురు కార్మికులపై ద్రవ ఉక్కు పడి అక్కడికక్కడే బూడిదయ్యారు. ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని విధంగా మారాయి. అటు ఎనిమిది మృతదేహాలను పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహాలను గుర్తించేందుకు మృతుల బంధువుల శాంపిల్స్‌ను తీసుకుని ల్యాబ్‌కు పంపిస్తామని వైద్యులు చెబుతున్నారు. డీఎన్ఏ పరీక్షలు పూర్తయ్యేందుకు నాలుగు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారు విశాఖలోని కిమ్స్, సెవెన్ హిల్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

# వైద్య శాఖలో 5 వేల మంది బదిలీ

ఆ తర్వాత వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ)లో 21 క్యాడర్లలో 557 మందిని, వైద్య విధాన పరిషత్(టీవీవీపీ)లో 26 క్యాడర్లలో 959 మందిని బదిలీ చేశారు. టీవీవీపీలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పెట్టుకున్న వెబ్ ఆప్షన్లకు బదులు వేరే ప్రాంతాలకు బదిలీ చేశారు. ఉదాహరణకు చౌటుప్పల్‌లో పనిచేసేవారిని కర్ణాటక సరిహద్దులోని ఆస్పత్రులకు బదిలీ చేశారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో జరిగిన క్లర్కికల్ తప్పిదాలను సరిదిద్దారు. గతంలో ఆఫ్‌లైన్ పద్ధతిలో చేపట్టిన బదిలీ ప్రకియలో అక్రమాలు చోటుచేసుకోవడంతో ఈసారి ఆన్‌లైన్ పద్ధతిలో చేపట్టారు. అయితే దక్షిణ తెలంగాణలోని ఓ జిల్లాల్లో ఓ పుడ్ సేఫ్టీ ఆఫీసర్‌ను బదిలీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే కొన్ని క్యాడర్లలో కొందరు బదిలీ కాలేదని, ఫోకల్ టూ ఫోకల్ ప్లేసులో ఉండిపోయారన్న ఆరోపణలు వినిపించాయి. హైదరాబాద్ ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో పనిచేసే నర్సులు కొందరు ఇక్కడిక్కడే బదిలీ అయ్యారని ఇతర నర్సులు ఆధారాలతో బయటపెట్టారు. నీలోఫర్ నుంచి 140 మంది నర్సులు బయటకెళితే అక్కడికి కేవలం 40 మందినే బదిలీ చేశారు.

# రహదారులపై చెత్త వేస్తే చర్యలు





**50 జివిపిల వద్ద సీసీ కెమెరాలతో నిఘా**
**కమిషనర్ చాంబర్లో సైతం స్క్రీన్ ఏర్పాటు**
**వ్యర్థాల హాట్‌స్పాట్ ప్రాంతాల్లో చెత్త ట్రాలీలు**
**నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి**
**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నగర రహదారులపై ఎక్కడబడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. మంగళవారం ఆయన వెంకటరమణ కాలనీ, గౌరి గోపాల్ ఆసుపత్రి కూడలి, రైల్వే స్టేషన్ రోడ్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.బస్టాండ్ ఎదురుగా యూకాన్ షాపి సమీపంలోని రహదారిపై ఓ మహిళ చెత్త వేయడానికి రావడంతో కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. రహదారులపై చెత్త వేసి పరిసరాలను అపరిశుభ్రంగా మారిస్తే మీ ఆరోగ్యంపైనే కదా ప్రభావం పడుతుందని, మరోసారి ఇలాంటి తప్పు చేయవద్దని హితవు పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని చెత్త ఎక్కువగా పేరుకుపోయే 50 గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల (జీవీపీలు) వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కెమెరాల దృశ్యాలను సంబంధిత శానిటేషన్ పర్యవేక్షకుల మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేస్తున్నామని, కమిషనర్ చాంబర్లో ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేసి తాను సైతం పర్యవేక్షిస్తానని పేర్కొన్నారు. నగరంలో వ్యర్థాలు అధికంగా వచ్చే గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల వద్ద 10 ప్రత్యేక చెత్త ట్రాలీలను అందుబాటులో ఉంచామని, వాటిలోనే చెత్తను వేయాలని కోరారు. త్వరలో మరో 10 ట్రాలీలను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఇంటి చెత్తను రహదారులపై కాకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని కమిషనర్ సూచించారు. ఒకవేళ ఇంటింటి చెత్త సేకరణకు సిబ్బంది రాకపోతే నగరపాలక సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 9766కు కాల్ చేయడం ద్వారా లేదా 7422992299 నంబర్‌కు వాట్సాప్ సందేశం పంపడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. నగర పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ కలెక్టరేట్ కార్యాలయంలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు జిలానీ, మునిస్వామి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్ ను పరిశుభ్రంగా ఉంచండి.

**కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.**



**తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 9నంది పత్రిక** కూరగాయల మార్కెట్లను మరింత పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి అధికారులకు, నిర్వాహకులకు సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా మంగళవారం నగరంలోని జయనగర్, పరసాల వీధి, చింతకాయల వీధి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాగా జయ నగర్ కాలనీలో కాలువలు పాడైపోయాయని ప్రజలు కమిషనర్ ను కోరగా వాటిని వెంటనే బాగు చేయాలని అధికారులకు చెప్పారు. నగరంలోని అన్ని ప్రధాన కాలువల్లో షిల్టు తీపించి శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. నగరంలో ఎక్కడా కూడా చెత్తకుప్పలు లేకుండా పారిశుద్ధ్య సిబ్బంది తొలగించాలని సూచించారు. రామచంద్ర పుష్కరిణి చుట్టూ ఎక్కడ చెత్త వేయకుండా చూడాలని తెలిపారు. పరసాల వీధిలోని మార్కెట్లో సమస్యలను వ్యాపారులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి వేళల్లో అనుమానితులు గోడదూకి మార్కెట్లోకి వస్తున్నారని, ప్రహరీ గోడ ఎత్తు పెంచాలని కోరారు. మార్కెట్ లోకి ప్రజలు ఎక్కువగా వస్తుంటారని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. తన దృష్టికి తీసుకు వచ్చిన స్థానికుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డిఈ లు మధు, లలిత, శానిటేషన్ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.



# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి





**పోలీసు శాఖ గౌరవాన్ని మరింత పెంచాలి**
**ఎస్ఐ స్థాయి నుండి సిఐలుగా పదోన్నతి .**
**ఎస్ఐ నుండి సిఐలుగా పదోన్నతి పొందిన**
**పోలీసు అధికారులను అభినందించిన ...**
**కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** కర్నూలు రేంజ్ పరిధిలో ఇటీవల సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) నుండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా పదోన్నతి పొందిన పోలీసు అధికారులు మంగళ వారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పోలీసు అధికారులను డీఐజీ అభినందించారు. పదోన్నతితో మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు.ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, చట్టబద్ధంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో మరింత చొరవ చూపాలని తెలిపారు.పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావడంతో పాటు ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని సూచించారు.సీఐలుగా పదోన్నతి పొంది డీఐజీ ని కలిసిన వారిలో... ఎ.పి. శ్రీనివాసులు, జీవన్ రెడ్డి , ముత్యాల శ్రీనివాసులు, ధనుంజయ,తిమ్మయ్య, లక్ష్మీనారాయణ, హను మంతయ్య, లలిత ఉన్నారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులు కర్నూలు రేంజ్ డీఐజీ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం నాడు కర్నూలు మెడికల్ కాలేజ్ యందు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కర్నూల్ మెడికల్ కాలేజ్ ఇన్చార్జి ప్రిన్సిపల్, ఏ.ఐస్,ఐ కర్నూల్ చైర్మెన్, సర్జరీ విభాగాధిపతి& ప్రొఫెసర్ డా. పి. హరి చరణ్ మాట్లాడుతూకర్నూలులో జూన్ 8 నుంచి 15 వరకు సర్జన్స్ వీక్ వేడుకలు సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దేశ వ్యాప్తంగా కూడా సర్జన్స్ వీక్ ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలలో ప్రజల్లో శస్త్రచికిత్సల పట్ల అవగాహన పెంపొందించడం, ఆధునిక వైద్య సాంకేతికతలపై చర్చలు, వైద్య విద్యార్థులు మరియు యువ వైద్యుల కోసం శాస్త్రీయ సమావేశాలు, ప్రజలకు ఆరోగ్య సూచనలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొక్కలు నాటే ఈ కార్యక్రమము లో ఏఎస్ఐ కర్నూలు శాఖ చైర్మన్ డా. హరి చరణ్, ఏఎస్ఐ సెంట్రల్ ఈసీ మెంబర్స్ డా. ఎస్ వి . రామ్మోహన్ రెడ్డి,డా. రామచంద్ర నాయుడు, ప్రొఫెసర్లు డా కోటి రెడ్డి, డాక్టర్ మాధవి శ్యామల డాక్టర్ జయరాం , సెక్రటరీ డాక్టర్ బి.జి రాహుల్, అసోసియేట్ డాక్టర్ విజయబాబు, అసిస్టెంట్లు పీజీలు వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం...
# ఆశలు నింపిన ప్రాజెక్టు, ప్రశ్నలు మిగిల్చిన పరిస్థితి..

**రాయలసీమ రాష్ట్ర ఉద్యమ నాయకులు కొత్తూరు సత్యం**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** రాయలసీమ అంటే కరువు. వర్షాల కోసం ఎదురు చూపులు. సాగునీటి కోసం రైతుల పోరాటమని,ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో నిర్మించిన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ఒకప్పుడు ఆశాకిరణంగా కనిపించిందని నేడు నిరాశగా మిగిలిందని రాయలసీమ రాష్ట్ర ఉద్యమ నాయకులు కొత్తూరు సత్యనారాయణ గుప్త ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూకృష్ణానది జలాలను ఎత్తిపోసి రాయలసీమ ప్రాంతాలకు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ పథకం వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతుల జీవితాల్లో మార్పు వస్తుందని ప్రజలు ఆశించారని ఆయన తెలిపారు.కానీ నేడు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తే అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి అనిప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా అనుకున్న స్థాయిలో నీటి వినియోగం జరుగుతోందా? రైతులకు పూర్తి ప్రయోజనం అందుతోందా? కాలువల నిర్వహణ సక్రమంగా ఉందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి అన్నారు.కొన్ని ప్రాంతాల్లో నీరు అందుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడుతున్నామని చెబుతున్నారు. భారీ వ్యయంతో నిర్మించిన పథకాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాకపోతే ప్రభుత్వ ఖజానాపై భారం పడటమే కాకుండా ప్రజల ఆశలు కూడా నెరవేరవు అని కొత్తూరు సత్యనారాయణ గుప్తా తెలిపారు.మరోవైపు విద్యుత్ వ్యయం కూడా ఈ పథకానికి ప్రధాన సవాలుగా మారిందనే అభిప్రాయాలు ఉన్నాయి.. ఎత్తిపోతల పథకాలు నిరంతరం నడవాలంటే భారీ స్థాయిలో విద్యుత్ అవసరం. ఆర్థిక పరంగా వాటి నిర్వహణ కూడా కీలక అంశమే అన్నారు.రైతుల అభిప్రాయం ప్రకారం, కేవలం ప్రాజెక్టు నిర్మాణం సరిపోదు. నీటి పంపిణీ వ్యవస్థ బలోపేతం కావాలి. చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలి. కాలువల మరమ్మతులు, నిర్వహణ పనులు నిరంతరం జరగాలి అని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉందని రైతులు వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తున్న ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకర విషయం అన్నారు.ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగునీటి సమస్య ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదని రైతు సంఘాలు చెబుతున్నాయి. ముచ్చుమర్రి పథకం ద్వారా మరింత సమర్థవంతంగా నీటిని వినియోగిస్తే వ్యవసాయ రంగానికి పెద్ద ఊతం లభించే అవకాశం ఉందని తెలిపారు.రాజకీయ నాయకులు, అధికారులు ప్రాజెక్టు ప్రారంభోత్సవాలు, గణాంకాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు వాస్తవంగా ఎంత ప్రయోజనం కలుగుతోందో సమీక్షించాల్సిన అవసరం ఉంది.రాయలసీమ రైతులకు నీరు అంటే జీవనాధారం. అలాంటి ప్రాంతంలో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కేవలం ఒక ప్రాజెక్టు కాదు... లక్షలాది మంది ఆశల ప్రతీక అని ఆ ఆశలు పూర్తిగా నెరవేరాలంటే ప్రాజెక్టు పనితీరుపై సమగ్ర సమీక్ష, నిరంతర నిర్వహణ, పారదర్శక పర్యవేక్షణ అత్యవసరం ఆయన డిమాండ్ చేశారు.ముచ్చుమర్రి నుంచి నీరు ప్రవహించాలి... రైతుల జీవితాల్లో సంతోషం నిండాలి. అదే ఈ పథకం అసలు లక్ష్యం తూట్లు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ దిశగా త్వరలో రాయలసీమ అభివృద్ధి కోసం ఒక వేదిక ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు.

# ఏపీలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్-2026 ప్రారంభం...
## తొలి మ్యాచ్ లో కాకినాడ కింగ్స్ గెలుపు

విశాఖపట్నంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) ఐదో సీజన్ ప్రారంభమైంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా ఎలాంటి వేడుకలు లేకుండా టోర్నమెంట్‌ను నిరాడంబరంగా మొదలుపెట్టారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు టోర్నీని ప్రారంభించారు. ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్ జట్టు, సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కాకినాడ కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ బ్యాటర్ యువన్ సిక్సర్లతో విరుచుకుపడి అజేయ హాఫ్ సెంచరీతో కదం తొక్కాడు. ఓపెనర్ అభిషేక్, అర్జున్, తపస్వి, మనీష్, వికెట్ కీపర్ లక్షజ్ రెడ్డి కూడా దూకుడుగా ఆడి తమ వంతు పరుగులు జోడించారు.

# పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి సిపిఎం డిమాండ్




**బేతంచెర్ల జూన్ 9 ( నందిపత్రిక ).** రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం పార్టీ పిలుపుమేరకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ భారత్ బేకరీ దగ్గర సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు ఖాజా భాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మధు శేఖర్, పార్టీ సీనియర్ నాయకులు వి. సుబ్బరాయుడు, బి. రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరియు ఎపి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై రోజు రోజుకు ఆర్థిక భారం మోపుతూ, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జీవనాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని విమర్శించారు. దేశంలో పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు నిరంతరం పెరుగుతుండటంతో, రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడుతోందని, దాని ఫలితంగా నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పాలు, గ్యాస్, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి, ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. ఇప్పటికే నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఆదాయాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరల పెంపు మరింత భారంగా మారిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గిన సందర్భాల్లో కూడా, కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఆ ప్రయోజనం అందించకుండా, ఎక్సైజ్ సుంకాల రూపంలో భారీగా పన్నులు వసూలు చేస్తోందని ఆరోపించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యాట్‌ను తగ్గించకుండా ప్రజల జేబులు ఖాళీ చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, ప్రజల సమస్యలను పూర్తిగా పక్కన పెట్టాయని విమర్శించారు. వ్యవసాయ రంగం ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో ఉందని, డీజిల్ పెట్రోల్ ధరల పెంపుతో రైతుల సాగు ఖర్చులు మరింత పెరిగాయని, ట్రాక్టర్లు, మోటార్లు, వ్యవసాయ యంత్రాల నిర్వహణ వ్యయం అధికమై, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెట్రోల్, డీజల్ గ్యాస్ ధరల పెంపు ప్రభావం సమాజంలోని ప్రతి వర్గంపై పడుతోందని, దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ, ప్రజలపై పన్నుల భారం మోపడం కేంద్ర ప్రభుత్వ విధానంగా మారిందని సిపిఎం నాయకులు విమర్శించారు. ఒకవైపు నిరుద్యోగం, మరోవైపు పెరుగుతున్న ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వాలు మాత్రం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించి, ప్రజలకు ఉపశమనం కల్పించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న అధిక పన్నులను వెంటనే తగ్గించి ధరలను నియంత్రించాలని, లేకపోతే ప్రజలతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో మరింత విస్తృత స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ఎస్ కే భాష, ఆటో వర్కర్స్ యూనియన్ మద్దిలేటి, జె శ్రీనివాసులు, రామకృష్ణ, జలంధర్, గఫర్, రామాంజనేయులు, విష్ణు నారాయణ, హుస్సేన్ భాష, జి శ్రీనివాసులు, బాలరాజు, శీను, మహేష్, వెంకట్రాముడు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

# నిత్యవసర ధరలు, ఇంధన ధరలు తగ్గించాలి--సీపీఐ డిమాండ్




**బేతంచెర్ల జూన్ 9 ( నందిపత్రిక ).** పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు. మంగళవారం బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా, సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించి, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశాయని విమర్శించారు. తరచూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల ప్రభావంతో రవాణా ఖర్చులు పెరిగి, నిత్యవసర వస్తువుల ధరలు కూడా అధికమవుతున్నాయని అన్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలను నియంత్రించి ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలోమండల సహాయ కార్యదర్శి తాలుక తిరుమలెష్ , ఏఐటియుసి మండల నాయకురాలు మహాలక్ష్మి ,వెంకటలక్ష్మి, రమాదేవి ,పుష్పావతి, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, సీపీఐ నాయకులు ధనుంజయ, మధు, శివ, ఎల్లాకృష్ణ, గౌరి ఉదయ్, శ్రీను, కోట్ల రాముడు, రాజేష్, శంకర్. తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ గ్యాస్ కరెంటు ధరలు తగ్గించాలని,, రాజ్ విహార్ సెంటర్ లో రాస్తారోకో







**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు నగరంలోని జిల్లా పరిషత్ నుండి రాజ్ విహార్ సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి రాజ్ విహార్ సెంటర్లో గంటసేపు రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ న్యూ సిటీ కార్యదర్శి రాముడు, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఎస్ యు సి ఐ జిల్లా నాయకులు హరీష్ అధ్యక్షత వహించారు. నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకు వేచి చూసి ఎన్నికలు పూర్తయిన వెంటనే భారీగా వంట గ్యాస్, పెట్రోలు డీజిల్ ధరలను పెంచిందని తెలిపారు. ఎన్నికల ముందు పెంచితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారనే భయంతోనే పెంచలేదని ఆరోపించారు. ఎందుకు పెంచారని ప్రజలందరూ నిలదీస్తుంటే ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధం కారణంగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెరిగినాయని తెలుపుతున్న నరేంద్ర మోడీకి వామపక్షాలుగా సూటిగా ఒకే ప్రశ్న అడుగుతున్నాము గతంలో అంతర్జాతీయ మార్కెట్లో 2014 తర్వాత భారీగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు తగ్గిన ధరలను ప్రజలకు ఎందుకు తగ్గించలేదని ప్రశ్నించారు. అలాగే భారతదేశంలో ధరలు తగ్గినప్పుడు మిగిలిన సొమ్మును కేంద్ర ప్రభుత్వం ఒక ఖాతాలో ఉంచి ధరలు పెరిగినప్పుడు అడ్జస్ట్ చేసి ధరలను స్థిరంగా ఉంచే పరిస్థితి ఉండేదని కానీ వాజ్ పేయి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాన్ని తుంగలో తొక్కిందని తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పునరావృతం చేయలేదని తెలిపారు. ఫలితంగా నేడు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు బడా కార్పొరేట్ కంపెనీలకు లేదా కేంద్ర ప్రభుత్వము లబ్ధి పొందుతుంది ప్రజలకు ఉపశమనం ఇవ్వడం లేదు క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగిన వెంటనే ప్రజల పైన బారాలను డైరెక్టా మోపుతుందని తెలిపారు ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలు పెరిగిన వెంటనే మొత్తం బయట ఎక్కడ భోజనం చేయాలన్న టిఫిన్ చేయాలన్నా భారీగా రేట్లు పెరిగిపోయినాయి అలాగే రవాణా రంగం పైన దీని ప్రభావం పడడంతో ఇతర నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరిగిపోయాయని తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజల ఆదాయం ఒక్క రూపాయి కూడా పెరగకుండా ధరల భారం భారీగా పెరగడంతో ప్రజలు తీవ్రంగా తల్లడిల్లి పోతున్నారని తెలిపారు. ఏమాత్రం నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్న వెంటనే పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలందరినీ ఐక్యం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పైన వేసే బారాలను, పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను ప్రజలకు వివరించి నరేంద్ర మోడీ చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ స్వరూపాన్ని తెలియజేస్తామని తెలిపారు. పెంచిన ధరలు తగ్గించే వరకు పోరాటాన్ని వామపక్షాలు ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు నగేష్ గురు శేఖర్ విజయ రామాంజనేయులు నగర కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహులు, సుధాకరప్ప సాయిబాబా ఎస్ఎండి షరీఫ్ రామకృష్ణ సిపిఐ సీనియర్ నాయకులు జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, శ్రీనివాసరావు ఎస్ యు సి ఐ సీనియర్ నాయకులు నాగన్న, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు, రాజు బాలు నాయక్ సిపిఐ నగర నాయకులు శ్రీనివాసరావు నాగరాజు చంద్రశేఖరు కుమార్ కిట్టు ఈశ్వర్ అశోక్ నల్లన్న బిసన్న మరియు విద్యార్థి యువజన సంఘాల నాయకులు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర అబ్దుల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయి ఉదయ్ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న ఐద్వా జిల్లా నాయకులు బంగి పద్మ ఎన్ ఎఫ్ డబ్ల్యూ నాయకులు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల ప్రజానాట్యమండలి కళాకారులు డప్పుల దరువులతో చిందులు వేశారు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పాటలు పాడి రాస్తారోకో కార్యక్రమాన్ని జిల్లా నగర నాయకులు విజయవంతం చేశారు.

# నీట్ అవకతవకలు, సీబీఎస్ఈ మూల్యాంకన వైఫల్యాలపై సమగ్ర విచారణ జరపాలి!

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న ఎన్ టి ఏ ను తక్షణమే రద్దు చేయాలి!




**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నీట్ పరీక్షల్లో చోటుచేసుకుంటున్న అవినీతి, ప్రశ్నాపత్ర లీకేజీలు, అవకతవకలను నిరసిస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్ టి ఏ ను రద్దు చేయాలని, నీట్ మరియు సీబీఎస్ఈ పరీక్షలలో జరిగిన అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐడీఎస్ఓ (ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి ఈ. మహేష్ మాట్లాడుతూ, నీట్ పరీక్షల్లో వరుసగా వెలుగులోకి వస్తున్న ప్రశ్నాపత్ర లీకేజీలు, నిర్వహణా లోపాలు పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదివినా, పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకల వల్ల వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోందన్నారు. అదే విధంగా సీబీఎస్ఈ ప్రవేశపెట్టిన ఓ ఎస్ ఎం విధానంలో తీవ్ర లోపాలు బయటపడుతున్నాయని పేర్కొన్నారు. అనేక మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు అసాధారణంగా తక్కువ మార్కులు రావడం, సమాధాన పత్రాల్లో బ్లర్ అయిన పేజీలు, మిస్సింగ్ పేజీలు, ఇతర అవకతవకలు కనిపించడం మూల్యాంకన వ్యవస్థలోని వైఫల్యాన్ని సూచిస్తున్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం, సంబంధిత సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నీట్ మరియు సీబీఎస్ఈ వ్యవహారాలపై సమగ్ర, పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ సెంట్రల్ జాయింట్ సెక్రటరీ అజయ్ కామత్, రాష్ట్ర అధ్యక్షులు వి. హరీష్ కుమార్ రెడ్డి, ఏఐడీఎస్ఓ నాయకులు సురేష్, అభిలాష్, మల్లేష్, చరణ్, తేజశ్రీ, ప్రియ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జూపాడుబంగ్లా ఎస్సీ బాలికల హాస్టల్లో 12వ తేదీ నుండి అడ్మిషన్లు ప్రారంభం ...వార్డెన్ ఉమాదేవి



**జూపాడుబంగ్లా: జూన్ :9: (నంది పత్రిక )** మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ లో ఈ నెల 12వ తేదీ నుండి అడ్మిషన్లు 6 తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థినిలకు అడ్మిషన్ లు నిర్వహించడం జరుగుతుందని వార్డెన్ ఉమాదేవి తెలిపారు. ఎస్సీ హాస్టల్లో చేరాలనుకునే విద్యార్థినీలు క్రింద తెలిపిన సర్టిఫికెట్లు తీసుకుని రావాలి.. ఆధార్ కార్డులు తల్లిదండ్రులవి విద్యార్థినివి ,రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ,విద్యార్థిని టి సి , ఇన్కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్లు ,మూడు ఫోటోలు తీసుకొని రావాలని తెలిపారు . ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ ఉమాదేవి మాట్లాడుతూ హాస్టల్లో బాలికలకు అన్ని వసతులు బాలికల రక్షణ కోసం అన్ని ఏర్పాట్లు మంచి భోజనం మంచివసతి, విద్యార్థినీలు చదువుకునేందుకు హాలు వసతి సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ఎస్సీ హాస్టల్లో చదువుకున్న విద్యార్థినిలు మంచి ప్రతిభను కనపరిచారని, రెండుసార్లు రాష్ట్రస్థాయిలో అవార్డులు కూడా ఏసి హాస్టల్ తరఫున విద్యార్థునిలు తీసుకున్నారని అన్నారు. గ్రామాల్లో చదువుకునే విద్యార్థినీలుకు ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు స్వదినియోగం చేసుకోవాలని కోరారు.

# స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ బేతంచెర్ల.

## బేతంచెర్ల గౌరి పేటలో ఆపరేషన్ క్లీన్ స్విప్ కార్యక్రమం.

**బేతంచెర్ల జూన్ 9 ( నందిపత్రిక ).** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నాతాధికారులు, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డోన్ ఎంఎల్ఎ కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి సూచనల మేరకు,బేతంచెర్ల నగర పంచాయితీ కమీషనర్ డి. హరిప్రసాద్ ఆధ్వర్యంలో బేతంచెర్ల లో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నాలుగు వారాల ప్రత్యేక పణాళికలో భాగంగా, మూడవ వారంలో "వ్యర్థాల వర్గీకరణ మరియు మార్కెట్లు, వాణిజ్య,ప్రాంతాల పరిశుభ్రత"పై స్థానిక గౌరిపేట కాలనీలో ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డి. హరి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతిరోజూ వ్యర్థాలను తమ వద్ద చేరే చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా తప్పనిసరిగా వేరు చేయాలని,తడి చెత్తను నగరపంచాయతి వాహనాలకు ఇవ్వకుండా,తమ సొంత ప్రాంగణాల్లోనే శాస్త్రీయంగా ప్రాసెస్ చేసుకునేలా, సొంత మెకానిజం ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న సింగిల్ యూజ్ (ఏకకాల వినియోగ) ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, నిబంధనల ప్రకారం వేరు చేసిన పొడి చెత్తను మాత్రమే ఇకపై మున్సిపల్ వాహనాలు సేకరిస్తాయని ఆయన స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లు, ఫంక్షన్ హాళ్లు, కళ్యాణ మండపాలు, హోటళ్లు, రెస్టారెంట్లు మరియు అపార్ట్‌మెంట్ల నిర్వాహకులు ఈ బాధ్యతను స్వీకరించి, ప్లాస్టిక్ రహిత పొడి వ్యర్థాలను మాత్రమే పురపాలక సిబ్బందికి అందించాలని,తడి చెత్తను వివిధ కంపోస్ట్ పద్ధతుల ద్వారా ప్రాసెస్ చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్' సాధన కోసం శతవిధాలా కృషి చేస్తోందని, అందులో భాగంగానే బేతంచర్ల నగర పంచాయతీ ను పరిశుభ్ర నగరంగా మార్చేందుకు పౌరులంతా బాధ్యతగా చెత్త వర్గీకరణపై పూర్తి అవగాహన కలిగి ఉండి, మున్సిపాలిటీకి సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే గౌరీపేట కాలనీ నందు పారిశుద్ధ కార్మికుల పని తీరుపై హర్షం వ్యక్తం చేశారు. ఆయా కాలనీవాసులు పారిశుధ్య కార్మికులకు సన్మానం జరిపి కమిషనర్ హరి ప్రసాద్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. మరల ఆయా కాలనీ వాసుల తో ప్రతిజ్ఞ చేయించడం జరిగినది ఈ కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు మెప్మా ఆర్పీలు మరియు ప్రజలు, పాల్గొన్నారు.



# భారత్‌తో బంధానికి ప్రతీక.. ఇజ్రాయెల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం!

భారత్‌తో స్నేహబంధాన్ని, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా ఇజ్రాయెల్ ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయాన్ని వెల్లడించింది. మరాఠా వీరయోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని తమ దేశంలోని ఒక ప్రధాన నగరంలో ప్రతిష్ఠించనున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న చారిత్రక మైత్రికి, దృఢమైన బంధానికి ఈ చర్య ఒక గొప్ప నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొంది. శివాజీ మహారాజ్ పట్టాభిషేక మహోత్సవం (శివ రాజ్యాభిషేక్ దిన్) సందర్భంగా ముంబైలోని ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ యానివ్ రెవాచ్ ఈ అధికారిక ప్రకటన చేశారు. శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, సమర్థవంతమైన నాయకత్వం, సుపరిపాలన, మత సామరస్యం మరియు నౌకాదళ వ్యూహాలు వంటి విలువలు ఇజ్రాయెల్ సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. ఈ మైత్రీ భావంతోనే ఇజ్రాయెల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిశ్చయించినట్లు రెవాచ్ వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇజ్రాయెల్ ప్రజలకు శివాజీ మహారాజ్ ఘనచరిత్రపై అవగాహన కల్పించడంతో పాటు, ఇరు దేశాల ప్రజల మధ్య బాంధవ్యాన్ని మరింత పెంపొందించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. ముంబైలో సిద్ధం చేయనున్న ఈ విగ్రహాన్ని ఇజ్రాయెల్‌కు తరలించి, అక్కడి ఒక ప్రముఖ ప్రాంతంలో ఆవిష్కరించనున్నారు. కాగా, ఈ ప్రతిపాదనను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్వాగతిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం

# ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే ప్రక్రియ లో జాయింట్ ఎల్పిఎంలు లేకుండా చూడాలి





**జిల్లాలో 45 లక్షల మొక్కల పెంపకం లక్ష్యాన్ని సాధించాలి**

**జలధార - జలహారతి పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి**

**జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే ప్రక్రియలో పొరపాట్లు లేకుండా నాణ్యతతో నిర్వహించాలని, జాయింట్ ఎల్పిఎంలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ, ప్లాంటేషన్, హౌసింగ్, జలధార - జలహారతి, అక్షరాంధ్ర తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జాయింట్ ఎల్పిఎంలను ఒక గ్రామంలో 2 శాతం కన్నా ఎక్కువ ఉండకూడదన్నారు. జాయింట్ ఎల్పిఎంల వల్ల ప్రజలకు, అధికార యంత్రాంగానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు..పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ, ఈ-కేవైసీ ప్రక్రియ, డ్రాఫ్ట్ మరియు తుది ఆర్ఓఆర్ తయారీ వంటి ప్రక్రియల్లో కనీసం 95 శాతం ఖచ్చితత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు భూ యజమానులకు జాయింట్ ఎల్పిఎం వల్ల కలిగే ఇబ్బందులను వివరించి, ఫీల్డ్ స్థాయిలోనే వివాదాలను పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. మ్యుటేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సవరణలు, లావాదేవీలు లేదా వారసత్వ బదిలీలకు సంబంధించిన మ్యుటేషన్లను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. నోషనల్ ఖాతాలు, జీరో ఖాతాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకుండా చూసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డీఎల్ఆర్ ప్రక్రియలో భూముల వర్గీకరణను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. సరైన పరిశీలన లేకుండా పట్టా భూములను ప్రభుత్వ భూములుగా, 22-ఏ భూములుగా లేదా డాటెడ్ ల్యాండ్లుగా నమోదు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డుల నవీకరణలో ఖచ్చితత్వం, పారదర్శకత మరియు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి దశను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రీ-సర్వే ప్రక్రియలో డేటా వెరిఫికేషన్‌ను అన్ని స్థాయిల్లో (ఞూ, ఎ=ూ, తహసిల్దార్) ఖచ్చితంగా పూర్తి చేసి జాయింట్ కలెక్టర్ కు పంపాలని సూచించారు. ఎక్స్టెంట్, యాజమాన్యం, ప్రభుత్వ భూములు, పట్టా భూములు, ఇనాం భూముల వివరాలు సరిచూసి పంపాలన్నారు.. ఫేజ్-1 నుంచి ఫేజ్-5 వరకు ఉన్న రీ-సర్వే గ్రామాల్లో వివిధ లాగిన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.. ఫీడ్‌బ్యాక్‌లో భూ యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సర్వేలు, విచారణలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. తహసీల్దార్లు, వీఆర్ఓలు తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, రెండు పక్షాలకు సమాచారం ఇచ్చిన తర్వాతే సర్వేలు, విచారణలు నిర్వహించాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో అదనపు డబ్బులు వసూలు చేయలేదని 90% మంది చెప్పారని, ఈ శాతం 100%కు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. నోటీసుల జారీ, విచారణల నిర్వహణలో నిర్లక్ష్యం కొనసాగితే తహసీల్దార్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.. డీమ్డ్ ఫారెస్ట్ భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసే ప్రక్రియలో మొత్తం 30,000 ఎకరాల్లో 27,476 ఎకరాలు నమోదు అయ్యాయని, మిగిలిన 2,422 ఎకరాల డేటా ఎంట్రీని 10 రోజుల్లో పూర్తి చేయాలన్నారు.పీజీఆర్ఎస్ మీ సేవ ద్వారా అందిన 22-ఏ డీ నోటిఫికేషన్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్‌లో 300కు పైగా, మీ సేవలో 348 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి సుమారు ఒకటిన్నర నెలల గడువు ఇచ్చిన నేపథ్యంలో ప్రతి వారం కనీసం 100 కేసులను పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అదే విధంగా అధిక సంఖ్యలో ప్రజలకు ప్రయోజనం చేకూర్చే రెవెన్యూ సంబంధిత అంశాలను గుర్తించి మూడు రోజులలోపు ప్రత్యేక ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజలకు మేలు చేసే అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ప్లాంటేషన్ కు సంబంధించి జిల్లాలో భారీ స్థాయిలో మొక్కలను నాటే కార్యక్రమాలను చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సుమారు 45 లక్షల మొక్కలు నాటడం లక్ష్య సాధనలో భాగంగా ఇప్పటికే 25 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, అందులో డ్వామా ద్వారా 10 లక్షలు, అటవీ శాఖ ద్వారా 15 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంకా రెండు నెలల వ్యవధిలో అదనంగా 20 లక్షల మొక్కలను పెంచి సిద్ధం చేయాలని కలెక్టర్ జిల్లా అటవీ అధికారి ను ఆదేశించారు. పెంచిన చిన్న మొక్కలను విద్యాశాఖ ద్వారా విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు కూడా ఒక్కొక్కరికి మొక్క అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది మొక్కల నాటే కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించి జిల్లాలో పచ్చదనాన్ని పెంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, రోడ్లుభవనాల శాఖ (=&దీ), ఆర్టీసీ తదితర శాఖలకు రహదారుల వెంట మరియు వారి ఆధీనంలోని సంస్థాగత ప్రాంగణాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలన్నారు. వివిధ శాఖలు, సంస్థలకు అవసరమైన మొక్కల సంఖ్యపై ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జలధార - జలహారతి కి సంబంధించి జలకళ పనుల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల గణనీయమైన పురోగతి సాధించామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం జలకళ పనుల్లో 91 శాతం పనులు గ్రౌండింగ్ దశకు చేరుకున్నాయని, ఇది అన్ని శాఖల సమిష్టి కృషి ఫలితమని కలెక్టర్ అభినందించారు. మిగిలిన పనులు కూడా వారం రోజుల్లో గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రౌండింగ్ పూర్తయిన పనులను త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొత్తం 3,383 పనులు గ్రౌండింగ్ అయినప్పటికీ, ఇప్పటివరకు సుమారు 800 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా వేగవంతంగా పూర్తి చేసి, జలకళ పథకం కింద చేపట్టిన ప్రతి పనిని విజయవంతంగా ముగించాలన్నారు. . అదే విధంగా నీటి వనరుల అభివృద్ధిలో భాగంగా వివిధ సంస్థల సహకారంతో యంత్రాలను వినియోగించి 27 చెరువులకు సంబంధించిన ఫీడర్ కాలువలను శుభ్రం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ చర్యల వల్ల ఆయా చెరువులకు నీటి ప్రవాహం మెరుగుపడి, వాటిని నింపే అవకాశాలు పెరిగాయన్నారు. జిల్లాలో 28 ట్యాంకుల్లో 16 క్యాస్కేడ్ ట్యాంకులకు సంబంధించిన 34 ఫీడర్ ఛానళ్లను శుభ్రపరిచి, మొత్తం 31 కిలోమీటర్ల మేర క్లియరెన్స్ పనులు పూర్తి చేశారన్నారు. అలాగే 1.81 లక్షల చదరపు మీటర్ల జంగిల్ క్లియరెన్స్, 60,656 క్యూబిక్ మీటర్ల డీ-సిల్టింగ్ పనులు చేపట్టారన్నారు. మొత్తం 1,412 గంటలపాటు యంత్రాలు పనిచేసి, 7,122 లీటర్ల ఇంధన వినియోగంతో సుమారు రూ.1.12 కోట్ల విలువైన పనులను ఉచితంగా చేశామన్నారు. హౌసింగ్ కు సంబంధించి ఇళ్ల నిర్మాణాలు పూర్తైన వాటికి ఐహెచ్ఎల్ఎస్ నిర్మాణాల్లో పురోగతి లేకపోవడం ఏంటని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.. కోసిగి లాంటి మండలాలు బాగా పురోగతి సాధిస్తుంటే మిగిలిన మండలాలు పురోగతి ఎందుకు లేదని ప్రశ్నిస్తూ, వెంటనే పురోగతి సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

యోగాంధ్ర కు సంబంధించి యోగాభ్యాసకుల రిజిస్ట్రేషన్ లక్ష్యాన్ని చేరుకునేందుకు మరింత కృషి చేయాలన్నారు. యోగా ట్రైనర్ల రిజిస్ట్రేషన్ కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరు అర్బన్, ఎమ్మిగనూరు అర్బన్, హోళగుంద రూరల్, ఆదోని అర్బన్ లో వెంటనే యోగా కాంపిటీషన్ కార్యక్రమాలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వెన్యూ లను మ్యాపింగ్ చేసే ప్రక్రియ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అందరూ 1800 315 7008 టోల్-ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జూన్ 14 (ఆదివారం) ఉదయం 6:15 నుంచి 7:35 వరకు భారత ప్రభుత్వం నిర్వహించే యోగా డెమోన్‌స్ట్రేషన్ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో అందరూ పాల్గొనాలన్నారు. మండలంలో ఉన్న యోగా సంఘాలు, యోగా అసోసియేషన్లు మరియు యోగా ఆసక్తిగల వ్యక్తులు “యోగా సంఘం” పోర్టల్‌లో నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనేలా అన్ని యోగా సంస్థలకు సమాచారం ఇవ్వాలన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు 16,191 లక్ష్యం ఉండగా ఇప్పటికే 16,000 మంది నమోదు అయ్యారన్నారు. ఇంకా 130 మంది వాలంటీర్ల నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అక్షరాస్యత కార్యక్రమంలో లెర్నర్స్ నమోదు లక్ష్యం 1.87 లక్షలు కాగా ఇప్పటివరకు 46 వేల మంది మాత్రమే నమోదు అయ్యారన్నారు. ఇంకా 1.40 లక్షల మంది నమోదు చేయాల్సి ఉందని, వచ్చే వారం రోజుల్లో ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిరక్షరాస్యత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుని కూలీ పనులు, చిన్న వ్యాపారాలు చేసుకునే వారిని గుర్తించి నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. మండలంలోని పాఠశాలలు, హాస్టళ్ల పనితీరును పర్యవేక్షించడం ఎంపీడీఓలు బాధ్యతేనని కలెక్టర్ తెలిపారు. ఎంపీడీఓలు స్వయంగా క్రమం తప్పకుండా పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి పరిస్థితులను పరిశీలించాలన్నారు. మండలంలో ఉన్న 1012 పాఠశాలలు, హాస్టళ్లను వారానికి రెండు లేదా మూడు సందర్శనలు చేస్తే వాటి పనితీరుపై సమగ్ర అవగాహన పొందవచ్చన్నారు.. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్షణమే నీటి నమూనాల పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే పిల్లలకు అవసరమైన టాయిలెట్లు, మంచాలు, ఫ్యాన్లు, లైట్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, డిఎఫ్ఓ శ్యామల, హౌసింగ్ పిడి నరసింహ రెడ్డి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, డి ఆర్ డి ఏ పిడి రమణ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ ప్రభాకర్ రెడ్డి, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, డిడి అడల్ట్ ఎడ్యుకేషన్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల ఆటోనగర్ బాధిత కార్మికులకు అండగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

**మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కి తాలూకా సీఐ మధ్య వాగ్వివాదం.**

**బాధితుల కోసం రోడ్డుపై బైఠాయించిన భూమా.**

**నలుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు.**

**కేసు నమోదు చేయడంతో ధర్నా విరమించిన భూమా.**

**బాధితులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటా.**

**నాడు భూమా నాగిరెడ్డి..నేడు భూమా బ్రహ్మానందరెడ్డి.**



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 9 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో కొన్నేళ్లుగా ఆటో నగర్ స్థలాలపై రెండు వర్గాల మధ్య సమస్య మొదలైంది.ఆటో నగర్లో దాదాపు 30 మంది వద్ద అప్పటి అసోసియేషన్ నాయకులు,ఇద్దరు వైసిపి మాజీ కౌన్సిలర్స్ వారివద్ద డబ్బులు తీసుకొని ఏళ్ళ గడుస్తున్నా స్థలాలు చూపించకపోవడంతో సమస్య మొదలైంది.ఓ వర్గం కు నేతలు,అధికారుల అండ ఉండడంతో మరో వర్గం న్యాయం కోసం మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి నీ ఆశ్రయించారు.వారి సమస్య విన్న భూమా న్యాయం ఉండడంతో వారికి మద్దతు తెలిపోయారు.ఓ వర్గానికి మద్దతు ఇవ్వడంతో రాజకీయంగా తెలుగుదేశం పార్టీలో విమర్శలు మొదలయ్యాయి.ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు,జిల్లా ఎస్పీ,జిల్లా కలెక్టర్ దృష్టికి భూమా తీసుకొని వెళ్ళారు.కలెక్టర్ స్పందించి ఆటో నగర్ పై విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు ఇచ్చినా క్రింది స్థాయి అధికారులు స్పందించకపోవడంతో మరో సారి భూమా ను కలిశారు.గతంలో అన్యాయం జరిగిన బాధితుల పక్షాన భూమా నాగిరెడ్డి నిలబడేవారు.ప్రస్తుతం బాబాయికి తగ్గట్టుగా అబ్బాయి భూమా బ్రహ్మానందరెడ్డి అదే కోవాలో కార్యకర్తల కోసం ఎంతదూరమైనా వెళ్తారు.ఈ నేపథ్యంలోనే నంద్యాల ఆటోనగర్‌లో జరిగిన అక్రమాలపై గత కొంతకాలంగా బాధిత కార్మికుల తరపున పోరాటం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మరోసారి వారి సమస్యల పరిష్కారం కోసం ముందుకు వచ్చారు.ఆటోనగర్‌లో జరిగిన అక్రమాలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేకపోవడంతో బాధిత కార్మికులు మరోసారి భూమా బ్రహ్మానందరెడ్డిని కలిసి తమ గోడును వినిపించారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన కార్మికులతో కలిసి నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధితుల ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేయాలని కోరారు.ఈ సందర్భంగా స్టేషన్ సీఐ వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉందని భూమా బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. ప్రజాప్రతినిధిగా, బాధితుల తరపున న్యాయం కోరుతూ వెళ్లిన తనతో సీఐ అమర్యాదకరంగా ప్రవర్తించారని ఆయన పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదును స్వీకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ భూమా బ్రహ్మానందరెడ్డి బాధిత కార్మికులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.బాధితుల ఫిర్యాదును నమోదు చేసి, న్యాయమైన విచారణ చేపట్టే వరకు తాను వెనక్కి తగ్గబోనని ఆయన స్పష్టం చేశారు. పైస్థాయి అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సీఐ ప్రవర్తనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆటోనగర్ బాధితుల ఫిర్యాదుపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భూమా బ్రహ్మానందరెడ్డి చేపట్టిన ధర్నాకు స్పందించిన అధికారులు ఘటనపై దృష్టి సారించి బాధితుల ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేశారు. అనంతరం బాధితులకు న్యాయం జరిగేలా సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలికితీసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో భూమా బ్రహ్మానందరెడ్డి తన ధర్నాను విరమించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాధిత కార్మికులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేంత వరకు వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తానని భూమా బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆటోనగర్ బాధిత కార్మికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## కురుకుంద ఎస్సీ కాలనీ డ్రైనేజీలో మురుగునీరు నిలువ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు.



**నంది పత్రిక ఆత్మకూరు...** మంచినీటి పైప్ లైన్ లోనికి మురుగునీరు సజావుగా ప్రవహించకుండా నిల్వ ఉండటంతో మురుగు నీరు చేరి రోగాల బారిన పడుతున్న కాలనీవాసులు. తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మురుగు నీరు నిల్వ ఉండకుండా సజావుగా ప్రవహించేటట్లు ఏర్పాటు చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలోని ఎస్సీ కాలనీ డ్రైనేజీలు మురుగు నీటితో దర్శనమిస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతుందని కాలనీవాసులు వాపోయారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది డెంగ్యూ మలేరియా విష జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజి కి సమీపంలో మంచినీటి పైపులైను ఉందని మంచినీటిలోనికి మురుగు నీరు వచ్చి పిల్లలు పెద్దలు కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నామని అసహనం వ్యక్తం చేశారు. మంచి నీటిలోనికి మురుగు నీరు వచ్చి చేరి ఆ నీరు తాగటం వల్ల విష జ్వరాలు కలరా వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు గత వారం రోజుల నుండి మురుగు నీరు నిలువ ఉండి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడంలేదని నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్య తీసుకుని మురుగునీరు నిల్వ ఉండకుండా సజావుగా పారేటట్లు డ్రైనేజీ పూడికతీత తీయాలని తెలిపారు. లేనిపక్షంలో జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని డిమాండ్ చేశారు.

## బాలికల భద్రత మనందరి బాధ్యత

**- ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ**



**కొత్తపల్లి - నంది పత్రిక :** బాలికలను భద్రంగా, సురక్షితంగా చూసుకోవడం మనందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో అంగన్వాడీ సెంటర్ నందు కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాంగా చిన్నారులకు ఎటువంటి పౌష్టికాహారం ఇవ్వాలని చెప్పారు. అదేవిధంగా బాల్యవివహాల నిర్మూలణపై, బాల్యవివాహాల వల్ల చిన్న వయస్సులో కలిగే ఆరోగ్య సమస్యలపై తల్లులకు అవగాహన కల్పించారు. మనందరం బాలికలను బాగా చదివించాలన్నారు. బాలికల చదువు భవితకు వెలుగు అన్నారు. అనంతరం బాల్యవివాహాలు, బాలికల భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

# బిఎల్ఓ లు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి





**జూలై 14 లోపుగా 95% పైబడి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి**

**ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగవంతగా పూర్తి చేయాలి**

**అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్లుగా తప్పక నమోదు చేయించాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 9నంది పత్రిక** భీమవరం మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్ నందు మంగళవారం భీమవరం నియోజకవర్గం ఓటర్ల జాబితా సవరణపై (సర్ ) బిఎల్ఓ లకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పోలింగ్ స్టేషన్ వారిగా భీమవరం, వీరవాసరం మండలాలకు నియమించిన బిఎల్ఓ లతో మ్యాపింగ్ పై సమీక్షించారు. భీమవరం అర్బన్ మండలంలో 55.54 శాతం, రూరల్ లో 63 శాతం, వీరవాసరం మండలంలో 64 శాతం, మొత్తం నియోజకవర్గ పరిధిలో 59.98 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది అన్నారు. ఇంకా సుమారు 40 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, వేరే ప్రాంతాలకు మారిన, ఇతరత్రా కారణాలతో ఆ నివాసంలో లేకపోతే విచారించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అలాగే కొన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో బిఎల్ఓ లు 95% పైబడి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయడాన్ని పరిశీలించి వారిని అభినందిస్తూ, ఆ బిఎల్ఓ లను ఆదర్శంగా తీసుకుని మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి అన్నారు. జవాబుదారీతనంతో పనిచేయాలని, అంకితభావంతో పనిచేస్తే సాధ్యం కానిది ఏమీ లేదని హితవు పలికారు. బూత్ లెవల్ అధికారులు (బిఎల్ ఓ లు) తమ విధులను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, 2002 ఓటర్ల జాబితా మరియు 2025 తాజా జాబితాలను ఆధారంగా తీసుకుని మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, అవసరమైన ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర దరఖాస్తు పత్రాలను బిఎల్వోలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా వెయ్యి మంది ఓటర్లకు మాత్రమే పరిమితం ఉండేలా నిబంధనల ప్రకారం హేతుబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను వివరిస్తూ, జూన్ 5 నుండి 14 వరకు శిక్షణ మరియు ప్రింటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని చెప్పారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఓటరు నమోదుకు సంబంధించి అవసరమైన పత్రాలపై కూడా కలెక్టర్ వివరణ ఇచ్చారు. 01.07.1987కు ముందు జన్మించినవారు, 01.07.1987 నుండి 02.12.2004 మధ్య జన్మించినవారు, అలాగే 02.12.2004 తర్వాత జన్మించినవారికి వేర్వేరు ధృవపత్రాలు అవసరమవుతాయని తెలిపారు. జనన ధృవపత్రం, విద్యా ధృవపత్రాలు, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డులు తదితర పత్రాలను వినియోగించవచ్చు అన్నారు. ఇంటింటి సర్వే ద్వారా డూప్లికేట్ ఓటర్లు, మరణించినవారి పేర్లు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను సేకరించి జాబితా శుద్ధి చేపడతామని తెలిపారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువత, మహిళలు, దివ్యాంగులు, వలస కార్మికులు వంటి వర్గాల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు నిర్వహించనున్న ఇంటింటి సర్వేకు సంబంధించిన కిట్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో భీమవరం ఆర్డీవో మరియు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి కే.ప్రవీణ్ కుమార్ రెడ్డి, భీమవరం మున్సిపాలిటీ సహాయ కమిషనర్ ఏ రాంబాబు, తహసిల్దార్లు రావి రాంబాబు, రామాంజనేయులు, బి ఎల్ వోలు, తదితరులు పాల్గొన్నారు.




# వ్యవసాయ మార్కెట్ దుకాణాల వేలం పాటలకు భారీ స్పందన.

**10 దుకాణాలకు 3 లక్షల 26 వేల 800 ఆదాయం.**

**గోడౌన్ కు 85 వేలు.**



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 9 ( నంది పత్రిక )** నంద్యాల వ్యవసాయ మార్కెట్ దుకాణాల వేలం పాటలకు భారీ స్పందన లభించింది.10 దుకాణాలకు వేలం పాటలు పోటా పోటీగా సాగాయి.10 దుకాణాలకు గతంలో 26 వేలు వచ్చేది.గోడౌన్ కు గతంలో 32 వేలు వచ్చేది.ప్రస్తుతం వేలం పాటల్లో 10 దుకాణాలకు వేలం పాటల్లో 3 లక్షల 26 వేల 800 పాడుకున్నారు.అలాగే గోడౌన్ 85 వేలకు పాడుకున్నారు.గత 16 ఏళ్లుగా ఆ దుకాణాల్లో ఉన్న వారు తక్కువ ధరకు ఉండడంతో బాడుగ పెంచకుండా ఖాళీ చేయకుండా ఉండడంతో వ్యవసాయ కమిటీ కోర్టును ఆశ్రయించారు.కోర్టు వ్యవసాయ కమిటీ కె అనుకూలంగా తీర్పు వెలువరించారని మార్కెట్ యార్డ్ చైర్మెన్ గుంటుపల్లి హరి బాబు మీడియా తో పేర్కొన్నారు.ఈ నేపథ్యంలోనే వేలం పాటలు నిర్వహిస్తున్నామని ప్రకటించడంతో దాదాపు 100 మంది వేలం పాటల్లో పాల్గొన్నారు.సర్కార్ సవాల్ 5300 తో 1 నంబర్ దుకాణం నుంచి వేలం పాటలు మొదలు పెట్టారు.వేలం పాటలు కనివిని ఎరుగని రీతిలో ఎవరు ఊహించ నీ విధంగా వేలం పాటలు మొదలయ్యాయి.వేలం పాటల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు మధ్య వేలం పాటలు నిర్వహించారు.వేలం పాటల్లో 1 నంబర్ దుకాణం షేక్ ఇమ్రాన్ ఖాన్ 32,600 కు పడుకున్నారు.2 వ దుకాణం అజ్మీర్ 2700,3 వ దుకాణం సురేంద్ర 23,800.4 వ దుకాణం మాభూ భాష 23,800.5 వ దుకాణం చాంద్ బాషా 27,700.6 వ దుకాణం హార్షి అనే మహిళ 30,100.7 వ దుకాణం చాంద్ బాషా 35,500.8 వ దుకాణం నూర్ భాష 34,500.9 వ దుకాణం షేక్ సమ్మద్ భాష 42,000.10 వ దుకాణం భూషణ్ రెడ్డి 51 వేలకు పాడుకున్నారు.గోడౌన్ ను భూషణ్ రెడ్డి 85 వేలకు పాడుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వేలం పాటల్లో పాడుకున్న వారు దుకాణం బాడుగతో పాటు 18 శాతం జీఎస్టీ చెల్లించాలన్నారు.దుకాణం మూడేళ్ల పరిమితి ఉంటుందని ప్రతి ఏటా బాడుగపై 5 శాతం పెంచి ఇవ్వాలన్నారు.ప్రతి దుకాణం దారుడు బాడుగ ప్రతి నెల 5 వ తేదీ లోపు చెల్లించాలన్నారు.వేలం పాటలో దుకాణం దక్కించుకున్నారు వారు పాడిన పాట మొత్తాన్ని రెండు నెలల అడ్వాన్సుగా ఇవ్వాలన్నారు.ప్రస్తుతం ఆ దుకాణాల్లో ఉన్నవారిని 10 రోజుల్లోపు ఖాళీ చేయించిన తర్వాతనే ,దుకాణంలో చేరినప్పటినుంచి బాడుగ ఇవ్వాల్సివస్తుందని పేర్కొన్నారు.10 దుకాణాలకు,ఒక గోడౌన్ పై ఈ రోజు జరిగిన వేలం పాటల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీకి 4 లక్షల 11 వేల 800 ప్రతి నెల వస్తుందన్నారు.వ్యవసాయ మార్కెట్ కమిటీకి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు,పేరు న ధన్యవాదాలు తెలిపారు.మార్కెట్ యార్డ్ చైర్మెన్ గుంటుపల్లి హరిబాబు,కమిటీ సబ్యులు,అధికారులు పాల్గొన్నారు.



# ప్రజలపై వేస్తున్న ధరలబారాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల రాస్తారోకో





**- సిపిఎం ,సిపిఐ పార్టీ**

**కొత్తపల్లి - నంది పత్రిక** : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ఎరువులధరలు తగ్గించాలని ప్రజలపై వేస్తున్న పన్నుల బారాలు తగ్గించాలని సిపిఎం సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో కొత్తపల్లి బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎన్ స్వాములు సిపిఐ మండల కార్యదర్శికేతం వెంకట శివుడు మాట్లాడుతూ కేంద్రంలో ఉండే బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉండే కూటమి ప్రభుత్వం ప్రజల పైన భారాలు వేయడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయిన వెంటనే గ్యాస్ ధరలు పెంచడం నాలుగు సార్లు పెట్రోలు డీజిల్ ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని వేశారని అన్నారు మన రాష్ట్రంలోని కృష్ణ గోదావరి బేసిన్ లో ఉత్పత్తి అవుతున్న చమురును గుజరాత్ మహారాష్ట్రలకు తరలించి అక్కడి నుండి దేశమంతటా అమ్ముకునేందుకు రిలయన్స్ లాంటి కంపెనీల ఆస్తులు పెంచేందుకు కేంద్రం లో ఉన్న బిజెపి రాష్ట్రంలో ఉండే కూటమి ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు కేజీ బెసిన్ లో ఉత్పత్తి అవుతున్న గ్యాస్ ఆయిల్ లో 50 శాతం వాటా రాష్ట్రానికి రావాలని దీనిని సాధించడం ద్వారా పెట్రోలు డీజిల్ తక్కువ ధరకు ప్రజలకు అందించవచ్చు అని వారు అన్నారు అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్ పైన వేస్తున్న పన్నును తగ్గించడం ద్వారా కూడా ప్రజలకు తక్కువ ధరకు పెట్రోల్ డీజిల్ అందించవచ్చని అన్నారు కేంద్రంలో ఉండే నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం కాకుండా కార్పొరేట్ సంస్థల జేబులు నింపేందుకు అమెరికా ట్రంప్ మెప్పు పొందేందుకు చూస్తున్నారని విమర్శించారు ఓ పక్క వ్యవసాయానికి ఇచ్చే సబ్సిడీలను కేంద్ర ప్రభుత్వం కత్తిరిస్తూ ఎరువుల ధరలను విపరీతంగా పెంచింది సూక్ష్మ పోషకాల ఎరువులపై 50 కిలోల బస్తాకు 300 నుంచి 600 రూపాయల వరకు పెంచింది మరోవైపు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదు వ్యవసాయ ఖర్చులు పెరిగి రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని వారి డిమాండ్ చేశారు ప్రజలపై వేసిన పెట్రోలు డీజీలు గ్యాస్ ఎరువుల ధరలు తగ్గించకుంటే కేంద్రం నుండి బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి రాష్ట్రంలో ఉండే కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు ప్రజలపై వేసిన ఈ భారానికి వ్యతిరేకంగ ప్రజలు పోరాటాల కు సిద్ధం కావాలని వారు పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమానికి సిపిఎం మండల నాయకులు ఏ దినేష్ అధ్యక్షత వహించగా సిపిఎం సిపిఐ ప్రజాసంఘాల నాయకులు ఎం దాసు మోక్షేశ్వరుడు జి దాసు గూడెం చిన్న ఏసేపు భీమ లింగం ఎన్ గోపాల్ ఎన్ దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు

## పేద,మధ్య తరగతి ప్రజల సేవ కోసం గోళ్ళ రాజేష్ ఆద్వర్యంలో మూడు మార్కెట్ యార్డు దుకాణాలు..

**సేవాకార్యక్రమాలు మరింత విస్తరించే దిశగా మార్కెట్ యార్డు దుకాణాలను పాడిన..గోళ్ళ రాజేష్ సేవా సంస్థలు**



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 9 ( నంది పత్రిక )** నంద్యాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు సంబంధించిన మంగళవారం నిర్వహించిన దుకాణాల బహిరంగ వేలంలో ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త గోళ్ళ రాజేష్ మూడు దుకాణాలను దక్కించుకున్నారు.యార్డులో మొత్తం 10 షాపులకు వేలం నిర్వహించగా.. అందులో షాప్ నంబర్ 5, 6, మరియు 8లను గోళ్ళ రాజేష్ తరపున ప్రతినిధులు పాడుకున్నారు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ ప్రతినిధి, ప్రముఖ సీనియర్ పాత్రికేయులు నూర్ బాషా మీడియాతో మాట్లాడారు.గడిచిన ఐదేళ్లుగా గోళ్ళ రాజేష్ నంద్యాల నియోజకవర్గవ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని నూర్ బాషా కొనియాడారు. ప్రస్తుతం మార్కెట్ యార్డు వేలంలో దక్కించుకున్న ఈ మూడు షాపులను కూడా వ్యాపార కోణంలో కాకుండా, ప్రజల సంక్షేమానికి, వారికి మరింత మెరుగైన సేవలు అందించేందుకే ఉపయోగించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నంద్యాల ప్రజల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న గొల్ల రాజేష్‌కు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, తనకు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని నూర్ బాషా పేర్కొన్నారు.



# ఎన్హైచ్ 340 సి రహదారి విస్తరణ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టండి

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో**...ఎన్హైచ్ 340 సి రహదారి విస్తరణ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్హైచ్ 340 సి లో భాగంగా నంద్యాల చెక్ పోస్ట్ నుండి నందికొట్కూరు రోడ్డు వరకు చేపడుతున్న పనుల పురోగతి పై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల చెక్ పోస్ట్ నుండి నందికొట్కూరు రోడ్డు వరకు చేపడుతున్న మొత్తం 9 కిలోమీటర్ల రహదారి విస్తరణ ప్రాజెక్టులో ఇప్పటివరకు సుమారు 7.5 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1.5 కిలోమీటర్లలో జరుగుతున్న పనులలో పురోగతి తీసుకొని రావాలన్నారు. మిగిలిన 1.5 కిలోమీటర్ల భాగంలో సుమారు కిలోమీటర్ మేర పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్ కు వివరించారు. మిగిలిన 500 మీటర్ల విభాగంలో కూడా కేవలం 300 మీటర్ల మేర మాత్రమే సమస్యాత్మక ప్రాంతం ఉందని, ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆలయ ప్రాంతం వద్ద ఆలయం కారణంగా పనులలో కొంత ఆలస్యం జరుగుతోందని అధికారులు కలెక్టర్ దృష్టికీ తీసుకొని రాగా, స్థానిక ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, పరస్పర అవగాహనతో సమస్యను పరిష్కరించి ప్రాజెక్టును పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తికావడంతో ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ వసతులు అందుబాటులోకి రానున్నాయన్నారు.సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, నేషనల్ హైవే, కర్నూలు ఈఈ విజయభాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# గండి క్షేత్ర మహాత్మ్యం

## కొండల నడుమ కొలువైన రామదూత



**పోరుమామిళ్ల, జూన్ 9: (నంది పత్రిక )**ఆంధ్రప్రదేశ్ హృదయభాగమైన కడప జిల్లా వేంపల్లి సమీపంలో, ప్రకృతి రమణీయతకు నిలయమైన పాలకొండల నడుమ కొలువైంది పరమ పవిత్ర "గండి క్షేత్రం". దాదాపు రెండు వేల అడుగుల ఎత్తున ఆకాశాన్ని తాకేలా నిలిచిన పర్వత పంక్తులు, వాటి మధ్య నుండి గలగలా పారే పాపాఘ్ని నదీ ప్రవాహం భక్తుల హృదయాలను అబ్బురపరుస్తాయి. పరమశివుడు పార్వతీదేవికి వివరించినట్లుగా, వాయుపురాణంలో సైతం ఈ పుణ్యభూమి ఘనత వర్ణించబడింది. ఇది కేవలం ఒక ఆలయం కాదు; త్రేతాయుగపు స్మృతులకు, భక్తి ముక్తికి సజీవ సాక్ష్యం.త్రేతాయుగ గాథ: రాముడి బాణంతో రూపుదిద్దిన రూపంసీతాన్వేషణలో లక్ష్మణ సమేతుడై అరణ్య మార్గాన సాగుతున్న శ్రీరామచంద్రుడికి ఈ వాయుక్షేత్రం ఆశ్రయమిచ్చింది. ఇక్కడ తపస్సు చేసుకుంటున్న వాయుదేవుడు రాఘవులను సాదరంగా ఆహ్వానించి, సేదతీరమన్నాడు. లంకను జయించి సీతమ్మతో తిరిగి వస్తానని మాట ఇచ్చిన రాముడు, అన్నట్లుగానే రావణ వధ అనంతరం వాయుక్షేత్రానికి చేరుకున్నాడు. జగదభిరాముని రాకకై వాయుదేవుడు ఈ క్షేత్రాన్ని పెళ్ళిపందిరిలా ముస్తాబు చేశాడు. రెండు కొండల నడుమ ప్రకాశవంతమైన బంగారు మామిడాకుల స్వాగత తోరణాలను కట్టాడు. ఆ సుందర ప్రకృతికి ముగ్ధుడైన శ్రీరాముడు, ఒక బండరాయిపై కూర్చుని పరిసరాలను తిలకిస్తుండగా, యుద్ధంలో అంజనేయుడు చేసిన అద్భుత సహాయం గుర్తొచ్చింది. కృతజ్ఞతతో, అమితానందంతో తన బాణపు మునతో ఎదురుగా ఉన్న బండపై హనుమంతుని రూపాన్ని చెక్కడం ప్రారంభించాడు.

**అసంపూర్ణ చిత్రంలో అద్భుత శక్తి:**

చిత్రం పూర్తవుతున్న సమయంలో... అయోధ్యకు వెళ్ళే ముహూర్త కాలం మించిపోతోందని లక్ష్మణుడు గుర్తుచేశాడు. దాంతో శ్రీరాముడు ఆంజనేయుడి ఎడమచేతి చిటికెన వేలు గీయకుండానే అక్కడి నుండి బయలుదేరాడు. రాముడి బాణపు స్పర్శతో ఉద్భవించిన ఆ రూపమే నేటి గండి ఆంజనేయ స్వామి.

**ఉగ్రరూపం.. ఉద్దండ ప్రతాపం** ఈ క్షేత్రంలో స్వామివారు కుడిచేతిని అభయముద్రలా పైకెత్తి, ఎడమచేతిని నడుముపై ఉంచి దుష్టశిక్షణకు సిద్ధమైన ఉగ్రరూపంలో దర్శనమిస్తారు. నిప్పులు కురిసే కన్నులు, ముక్కంటి కోపం, చేత త్రిశూలం ధరించిన పరమేశ్వరుని రుద్రరూపంగా స్వామివారు ఇక్కడ శత్రువులకు సింహస్వప్నమై, భక్తులకు కల్పవృక్షమై విరాజిల్లుతున్నారు.కలియుగంలో వ్యాసరాయల వారు ఈ మూర్తిని దర్శించి, అసంపూర్తిగా ఉన్న చిటికెన వేలిని పూర్తి చేయాలని శిల్పులను పురమాయించగా, ఉలి తగలగానే ఆ వేలి నుండి రక్తం ధారగా స్రవించిందట! దాంతో భయపడి ఆ పని నిలిపివేసి, వ్యాసరాయల వారే ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. రాముడు వదిలిన ఆ అసంపూర్ణతలోనే నేటికీ స్వామివారి దివ్యత్వం ప్రకాశిస్తోంది.భక్తులు స్వామి దర్శనానంతరం అక్షకుమారుడిని దర్శించుకోవడం తరతరాల ఆచారం.

**దురితాలను హరించే 'కేశవ తీర్థం'.. 'పాపాఘ్ని నది'**

గండి క్షేత్ర మహిమ ఎంతటి పాపినైనా పునీతుడిని చేస్తుంది. పూర్వం కాశ్మీర దేశంలో దురాచారుడైన విష్ణుశర్మ కుమారుడు, ఈ క్షేత్ర సమీపంలోని కేశవ తీర్థంలో స్నానమాచరించిన వెంటనే సద్గుణ సంపన్నుడిగా మారి, మహావిష్ణువు గురించి తపస్సు చేసి మోక్షాన్ని పొందాడు.ఇక ఆలయ ముంగిట దక్షిణ ముఖం నుండి ఉత్తర ముఖంగా ప్రవహించే 'ఉత్తరవాహిని' పాపాఘ్ని నది విశిష్టత అనంతం. "నంది పాద సముద్ భూత పాపాఘ్ని పుణ్యదాయిని" అని వాయుపురాణం కీర్తించింది. కోలార్ జిల్లా నందికొండల్లో పుట్టి, పినాకిని నదిలో కలిసే ఈ నదిలో స్నానమాచరిస్తే



ఎంతటి ఘోర పాపాలైనా, దీర్ఘకాలికవ్యాధులైనా నశిస్తాయని నమ్మకం. పూర్వం ఒక రాజుకు సోకిన కుష్టు వ్యాధి ఈ నదీ స్నానంతోనే నివారణ పొందింది.

**అగమ్యగోచర 'బంగారు తోరణం'** త్రేతాయుగంలో వాయుదేవుడు కట్టిన ఆ బంగారు మామిడాకుల తోరణం నేటికీ అదృశ్య రూపంలో కొండల నడుమ వేలాడుతూనే ఉందని భక్తుల విశ్వాసం. 18వ శతాబ్దంలో కడప కలెక్టర్‌గా పనిచేసిన థామస్ మన్రో అనే ఆంగ్లేయ అధికారికి ఈ గండి కొండల మధ్య ఆ బంగారు తోరణం నిజంగానే కనిపించిందని ఆయన తన డైరీలో లిఖించుకున్నారు. మహనీయులకు, జీవిత చరమాంకంలో ఉన్న పుణ్యాత్ములకు మాత్రమే కనిపించే ఈ దివ్య తోరణం గండి క్షేత్ర అత్యంత అద్భుత రహస్యం.

**ముగింపు: శరణాగతి ప్రాశస్త్యం**శేషాచల పర్వతాల చివరగా, గండి పడినట్లు విడిపోయిన కొండల మధ్య వెలసిన ఈ గండి కొండల అధిపతిని దర్శిస్తే... గ్రహపీడలు, శని బాధలు, మనోభయాలు పటాపంచలవుతాయి. కడప విమానాశ్రయం లేదా రైల్వే స్టేషన్ నుండి వేంపల్లి మీదుగా సులభంగా చేరుకోగల ఈ ఆధ్యాత్మిక కేంద్రం, భక్తుల పాలిట కొంగుబంగారం.

భక్తితో తలవంచితే భయాలను హరించే ఆ గండి వీరాంజనేయుని పాదపద్మాలకు నమస్కరిస్తూ... శ్రీరామదూతం శిరసా నమామి!

**రచన :బొల్లు రామమోహన్, రచయిత, పోరుమామిళ్ల.**

# రసాయనిక ఎరువులను భూసార పరీక్షల ఆధారంగా వాడాలి



**మహానంది జూన్ 09 (నంది పత్రిక):–** రసాయనిక ఎరువులను భూసార పరీక్షల ఆధారంగా, సిఫార్సు చేసిన మోతాదుల్లో మాత్రమే వాడాలని అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. పవన్ కుమార్ రెడ్డి, డా.శృతి తెలిపారు. మంగళవారం మహానంది మండలం నందిపల్లె, సీతారామపురం గ్రామాల్లో "ఖేత్ బచావో అభియాన్ " కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో వరి గడ్డి మరియు ఇతర వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయడం వల్ల భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు.అందువల్ల వ్యవసాయ వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా అవి సేంద్రియ ఎరువులుగా మారి భూసారాన్ని పెంచుతాయని వివరించారు.రసాయనిక ఎరువులను భూసార పరీక్షల ఆధారంగా, సిఫార్సు చేసిన మోతాదుల్లో మాత్రమే వాడాలని సూచించారు.విచక్షణారహితంగా ఎరువులు వినియోగించడం వల్ల భూమి సారవంతం తగ్గి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించడం కష్టమవుతుందన్నారు.రైతులకు మట్టి నమూనాలు సేకరించే సరైన విధానాన్ని వివరించారు.అలాగే భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలియజేశారు.మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ రైతులందరూ కంపల్సరిగా పంట సాగు హక్కు పత్రం (సిసిఆర్సి కార్డ్స్)ను మీ రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పత్రాలను పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వి. వెంకటేశ్వర్లు, వివో ఏ చంద్రశేఖర్,మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



# స్మార్ట్ కిచెన్ లతో విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా..!




**స్మార్ట్ కిచెన్స్ వర్క్ షాపులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**మండల సమాఖ్య సభ్యులే 'సూపర్ మేనేజర్లు'..**

**నాణ్యమైన పౌష్టికాహారంలో రాజీ లేదు**

**వైఎస్ఆర్ కడప,బ్యూరోచీఫ్ జూన్ 9నంది పత్రిక :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి శుభ్రమైన,సురక్షితమైన, పోషక విలువలు కలిగిన వేడివేడి భోజనం అందించడమే స్మార్ట్ కిచెన్ ల ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో.. స్మార్ట్ కిచెన్ల నిర్వహణపై సంబంధిత స్టేక్ హోల్డర్స్ కు అవగాహన పెంచే ఒక్కరోజు వర్క్ షాపు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ డా. నిధీ మీనా హాజరై పలు కీలక మార్గదర్శకాలను వెల్లడించారు. ప్రభుత్వం ఖరారు చేసిన మెనూనే అమలు..!

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో సమతుల్య పోషకాలు ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక మెనూను రూపొందించిందని కలెక్టర్ తెలిపారు. గుడ్లు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు,కూరగాయలు, పండ్లు వంటి పోషకాహార పదార్థాలు తప్పనిసరిగా ఉండేలా వారాంత మెనూ సిద్ధం చేసినట్లు చెప్పారు.ప్రతి స్మార్ట్ కిచెన్‌లో మెనూ బోర్డును ప్రదర్శించి, అందులో ఎలాంటి మార్పులు చేయకుండా కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

**పరిశుభ్రతే విజయానికి మూలం..!**

పిల్లల ఆరోగ్యం,ఎదుగుదల, విద్యా ప్రగతికి పౌష్టికాహారం అత్యంత అవసరమని పేర్కొంటూ,స్మార్ట్ కిచెన్ల నిర్వహణలో నాణ్యత, పరిశుభ్రత,సమయపాలన విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. స్మార్ట్ కిచెన్లలో పనిచేసే వంట సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. వంట సమయంలో టోపీ, గ్లౌజులు, ఆప్రాన్ ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, గోళ్లు కత్తిరించుకోవడం వంటి నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు లేదా ఇతర అంటువ్యాధులతో బాధపడుతున్న వారు వంటశాలలోకి ప్రవేశించరాదని స్పష్టం చే శారు.వంటశాలలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, నేలను తరచుగా శుభ్రపరచాలని,పాత్రలను వేడినీటితో కడగాలని ఆదేశించారు.పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమం కావడంతో పరిశుభ్రత విషయంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని సూచించారు.

**పోషక విలువలు తగ్గకుండా ఆధునిక వంట విధానాలు..!**

కూరగాయలను శుభ్రపరిచిన తర్వాత మాత్రమే వంటకు ఉపయోగించాలని,స్టీమ్ కుకింగ్ విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.ఎక్కువసేపు ఉడికించడం వల్ల పోషక విలువలు తగ్గిపోతాయని, అందువల్ల శాస్త్రీయ పద్ధతుల్లో వంట ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు.వండిన ఆహారాన్ని నిర్ణీత సమయానికే విద్యార్థులకు అందించాలని, నిల్వ ఉంచిన లేదా మళ్లీ వేడి చేసిన ఆహారాన్ని వడ్డించరాదని స్పష్టం చేశారు.

**మండల సమాఖ్య సభ్యులదే పూర్తి బాధ్యత..!**

ప్రతి మండలంలోని స్మార్ట్ కిచెన్ నిర్వహణ బాధ్యతలను మహిళా మండల సమాఖ్య సభ్యులు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.వారే 'సూపర్ మేనేజర్ల'గా వ్యవహరిస్తూ సరుకుల కొనుగోలు,నాణ్యత పరిశీలన, నిల్వ, వంట, పంపిణీ, పరిశుభ్రత, ఫీడ్‌బ్యాక్ సేకరణ,రికార్డుల నిర్వహణ వంటి అన్ని అంశాలను పర్యవేక్షించనున్నారని చెప్పారు.రోజువారీ స్టాక్ రిజిస్టర్, వంట రిజిస్టర్,హాజరు రిజిస్టర్, ఫిర్యాదుల రిజిస్టర్ నిర్వహణ లో నిర్లక్ష్యం ఉండరాదని, ఏ చిన్న లోపం జరిగినా బాధ్యత సంబంధిత సమాఖ్య సభ్యులదేనని స్పష్టం చేశారు.స్మార్ట్ కిచెన్ అనేది కేవలం వంటశాల కాదని,అది విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రగతి, భవిష్యత్తుకు బలమైన పునాది అని కలెక్టర్ అన్నారు. నాణ్యమైన పౌష్టికాహారం అందించడం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పాఠశాల హాజరు, అభ్యాస సామర్థ్యం కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.

**కిచెన్ మేనేజర్లు, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్లకు ప్రత్యేక బాధ్యతలు..!** ప్రతి స్మార్ట్ కిచెన్ లో ఒక కిచెన్ మేనేజర్‌తో పాటు ఒకటి లేదా రెండు స్మార్ట్ డిస్ట్రిబ్యూషన్ మేనేజర్లు పనిచేస్తారని కలెక్టర్ వివరించారు. కిచెన్ మేనేజర్ వంట,నాణ్యత, పరిశుభ్రత అంశాలను పర్యవేక్షిస్తే, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్లు హాట్ బాక్సుల ద్వారా పాఠశాలలకు వేడివేడి భోజనం సమయానికి చేరేలా చూస్తారని తెలిపారు.

ఈ బాధ్యతలను సమర్థవంతం గా నిర్వహించేందుకు హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణులు, పోషకాహార నిపుణులతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు.

**ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ..!**

స్మార్ట్ కిచెన్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు బలమైన మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత ఎంఈఓలతో పాటు నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు కిచెన్లను తరచూ తనిఖీ చేస్తూ నాణ్యత ప్రమాణాలు అమలవుతున్నాయో లేదో పరిశీలించనున్నారని చెప్పారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు, సరుకుల నిల్వ, వంట విధానాలు, పాఠశాలలకు భోజన పంపిణీ వంటి అంశాలపై ప్రత్యేక నివేదికలు సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి అందజేయనున్నట్లు తెలిపారు.

**జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్..!**

స్మార్ట్ కిచెన్ల నిర్వహణను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. కిచెన్ల నుంచి వచ్చే సమాచారం, ఫిర్యాదులు, సూచనలను వెంటనే స్వీకరించి స్పందించే విధంగా వ్యవస్థ రూపొందిస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా ప్రతి కిచెన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా వంట ప్రక్రియ, పరిశుభ్రత,ఆహార పంపిణీ తదితర అంశాలను జిల్లా కేంద్రం నుంచే పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు.తల్లిదండ్రులకు ప్రత్యేక యాప్ ద్వారా ప్రతిరోజూ మెనూ, ఫొటోలు, వీడియోలు పంపించి పూర్తి పారదర్శకతను తీసుకురానున్నట్లు చెప్పారు.

**స్మార్ట్ కిచెన్లను దేశానికే ఆదర్శంగా నిర్వహించాలి..!!**

స్మార్ట్ కిచెన్ వ్యవస్థను రాష్ట్రానికే కాకుండా దేశానికీ ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు.అధికారులు,మండల సమాఖ్య సభ్యులు,కిచెన్ సిబ్బంది అందరూ నిబద్ధతతో పనిచేసి కడప జిల్లాను జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయాలని, ఈ కార్యక్రమానికి ప్రతిష్ఠాత్మక ప్రధానమంత్రి అవార్డు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసం పెంచే విధంగా ఈ కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా అమలు చేయాలని అన్ని శాఖల అధికారులు, మండల సమాఖ్య సభ్యులకు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా,స్టెప్ సీఈవో, స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, డీఈవో శంశుద్దీన్, ఎస్ఎస్ఏ ఏపిసి అనురాధ, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఆర్ డబ్ల్యూఎస్, పీఆర్ ఎస్ఈ లు ఏడుకొండలు, మద్దయ్య, ఐసీడీఎస్ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, అన్ని మండలాల ఎంఈఓలు, మండల సమాఖ్య అధ్యక్షులు,కిచెన్ మేనేజర్లు, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్లు పాల్గొన్నారు.

–



# మహానంది దేవస్థానానికి లాకర్ విరాళం

**మహానంది జూన్ 09 (నంది పత్రిక):–** మహానంది దేవస్థానానికి హైదరాబాద్ నగరానికి చెందిన డాక్టర్ రాజశేఖర్ చక్రవర్తి, డాక్టర్ కిరణ్మయి దంపతులు రూ.2 లక్షల విలువైన లాకర్ అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు భద్రపరుచుకోవడానికి లాకర్ ఉపయోగపడుతుందని అధికారులు చెప్పారు.లాకర్ అందించిన దాతలకు ఆలయ అధికారులు శ్రీ మహానందీశ్వర స్వామి వారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయించారు.




# ఓటరు ధృవీకరణలో బి ఎల్ ఏ లు అప్రమత్తంగా ఉండండి

**ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునః పరిశీలన (సర్ ) అవగాహన లో మంత్రి బీసి జనార్దన్ రెడ్డి**



**బనగానపల్లె జూన్ 9నందిపత్రిక** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునఃపరిశీలన (సర్ – స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమంలో బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు మంగళవారము పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో సర్ కార్యక్రమంపై తెలుగుదేశం పార్టీ బనగానపల్లె నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అక్కడికి వచ్చిన బిఎల్ఏలు పార్టీ నాయకులు కార్యకర్తలకు సర్ కార్యక్రమం పై అవగాహన కల్పించారు.ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించడం, అర్హులైన యువతను ఓటరుగా నమోదు చేయించడం, ఓటర్ల వివరాలలో ఉన్న తప్పులను సరిదిద్దడం, క్షేత్రస్థాయిలో ఓటర్ల ధృవీకరణను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై కూటమి నేతలకు మంత్రి దిశానిర్దేశం చేశారు సర్ ప్రక్రియ సమయంలో నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఓటరు జాబితాలో పారదర్శకతను కాపాడటానికి కూటమి పార్టీ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలో సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు .సర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే ఉన్న ఓట్ల తొలగింపు, దొంగ ఓట్ల నమోదు వంటి విషయాల్లో ప్రతిపక్షం తీరుపై అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.బూత్ లెవెల్ ఏజెంట్ లు మార్గదర్శి పుస్తకాలు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ఎన్ డి ఏ కూటమి పార్టీలకు చెందిన పార్లమెంట్, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ ప్రతినిధులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు మరియు కార్యకర్తలు హాజరయ్యారు.



# ఆన్‌లైన్ పెట్టుబడి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

## భారీ లాభాల ఆశ చూపే నకిలీ పెట్టుబడి పథకాలను నమ్మవద్దు... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ .



**కర్నూలు నంది పత్రిక బ్యూరో......**ఇటీవల కాలంలో ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మంగళవారం తెలిపారు.సైబర్ నేరగాళ్లు తక్కువ కాలంలో భారీ లాభాలు వస్తాయని, లలో ప్రత్యేక అవకాశాలు ఉన్నాయని, క్రిప్టో ట్రేడింగ్ ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని నమ్మిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వాట్సప్, టెలిగ్రామ్ ఫేస్బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా నకిలీ పెట్టుబడి గ్రూపులను ఏర్పాటు చేసి అమాయక ప్రజలను తమ వలలోకి దింపుతున్నారని హెచ్చరించారు. మొదట చిన్న మొత్తాలను పెట్టుబడిగా తీసుకుని కొంత లాభం వచ్చినట్లు చూపించి నమ్మకం కల్పించి, అనంతరం పెద్ద మొత్తాలను పెట్టుబడి పెట్టించేలా ప్రలోభాలకు గురిచేస్తారని తెలిపారు. డబ్బులు జమ చేసిన తర్వాత నేరగాళ్లు సంబంధాలు తెంచుకుని బాధితులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రజలు పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థ లేదా ప్లాట్‌ఫారమ్‌కు భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ (సెబి) గుర్తింపు ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు.అపరిచిత వ్యక్తులు పంపించే లింకులు, యాప్‌లు లేదా పెట్టుబడి ఆహ్వానాలను నమ్మి డబ్బులు పంపరాదన్నారు.అలాగే ఓటిపిలు, యూపీఐ పిన్‌లు, బ్యాంక్ ఖాతా వివరాలు, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు.అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, తెలియని యాప్‌లను మొబైల్ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని కర్నూలు ఎస్పీ తెలిపారు.త్వరగా ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. అప్రమత్తతే సైబర్ నేరాల నివారణకు ప్రధాన ఆయుధమని కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.

# ఆంధ్ర జ్యోతి రిపోర్టర్ జయరాజు పై దాడికి ప్రయత్నించిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** భూ కబ్జాలపై వార్తలు రాస్తే జీర్ణించుకోలేని కబ్జాదారులు మంత్రాలయం రిపోర్టర్ జయరాజుపై దాడికి ప్రయత్నించడం సిగ్గుచేటని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (×జీఖ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు ఎన్ వెంకట సుబ్బయ్య, కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర సమితి సభ్యులు వైవీ కృష్ణా రెడ్డి, భాష్యం మధు సుధన్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజి, జిల్లా సహాయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, వెంకటేష్, ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, చిరంజీవి డిమాండ్ చేశారు. మంత్రాలయం సమీపంలో తుంగభద్ర నదీ సమీపంలో బఫర్ జోన్ భూమిని ఆక్రమించి వెంచర్ వేసి అమ్ముకుంటున్న విషయం తెలుసుకొని వరుస కథనాలు ఆంధ్ర జ్యోతి పేపర్ లో రాయడం జరిగిందన్నారు. దీంతో అధికారులు స్పందించి వంక ఫోరం బోకు భూమిలో ఏర్పాటు చేసిన ప్రహరీ గోడను కూల్చేసేందుకు నోటీసులు ఇచ్చారన్నారు. అంతేకాక కూల్చివేతకు రావడంతో అధికారులు రావడంతో జయరాజ్ తో పాటు మరికొంత మంది జర్నలిస్టులు కబ్జా చేసిన ప్రాంతానికి వెళ్లారన్నారు. అయితే అక్కడే ఉన్న కబ్జాదారులు జయరాజ్ పై బూతు పురాణం అందుకోవడమే కాకుండా దాడికి ప్రయత్నించడం దుర్మార్గం అన్నారు. తప్పులు ఎత్తి చూపితే ఇలా దాడులకు పాల్పడే సంస్కృతి ఇటీవల పెరిగిపోయిందని చెప్పారు. జయరాజ్ పై దాడికి ప్రయత్నించిన కబ్జాదారులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జయరాజ్ కు భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తగిన భద్రత కల్పించాలని కోరారు. జర్నలిస్టుల పై దాడులు, బెదిరింపులు రోజు రోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి డిమాండ్ చేశారు. దాడుల నివారణకు యాంటి ఎటాక్ కమిటీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# గర్భిణీల ఆరోగ్య పరిరక్షణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 56 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు.




**వెలుగోడు, జూన్ 09 (నంది పత్రిక):** వెలుగోడు మండలం మోతుకూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ మంగళవారం గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన ప్రసూతి పూర్వ వైద్య సేవలను అందించడం, తల్లి–శిశు ఆరోగ్యాన్ని పరిరక్షించడం కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మొత్తం 56 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది గర్భిణీలకు రక్తపోటు, రక్తహీనత, మధుమేహం తదితర ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి వైద్య సలహాలు, చికిత్స అందించారు. అధిక ప్రమాద గర్భధారణ (హై రిస్క్ ప్రెగ్నెన్సీ) కేసులను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణకు నమోదు చేశారు.కార్యక్రమంలో వైద్యాధికారులు మాట్లాడుతూ గర్భిణీలు ప్రతినెల క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐరన్, కాల్షియం మాత్రలను నిర్లక్ష్యం చేయకుండా, పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి మరియు శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. సురక్షిత ప్రసవం ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు , ఏ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగమ పాఠశాల ప్రవేశ పరీక్ష



**శ్రీశైలం మే 09(నంది పత్రిక)** దేవస్థానం నిర్వహిస్తున్న వీరశైవ ఆగమపాఠశాల ప్రవేశ పరీక్ష (09.06.2026) నిర్వహించబడింది. చంద్రవతి కల్యాణమండపములో ఈ పరీక్షను నిర్వహించడం జరిగింది. వీరశైవ ఆగమ కోర్సులో ప్రవేశానికై ఈ పరీక్షను నిర్వహించబడింది. జరిగిన ప్రవేశ పరీక్షకు మొత్తం 25 మంది అభ్యర్థుల దరఖాస్తు చేసుకోగా 22 మంది పరీక్షకు హాజరయ్యారు. ముగ్గురు గైరు హాజరు అయ్యారు. హాజరైన వారందరూ ప్రవేశ అర్హతను పొందారు. కోర్సులో ప్రవేశ అర్హతను పొందిన వారి ధృవీకరణ పత్రాలు పరిశీలించబడ్డాయి. కాగా ఈ ఆగమ కోర్సు కాలపరిమితి 6 సంవత్సరాలు. విద్యాభ్యాస సమయంలో విద్యార్థులందరికీ ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించబడుతుంది. కాగా ఈ పరీక్ష నిర్వహణలో స్వామివారి ఆలయ ఉప ప్రధానార్చకులు మరియు ఆగమ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శివశంకరయ్య స్వామి, సహాయ కార్యనిర్వహణాధికారి జి.స్వాములు, పాఠశాల పర్యవేక్షకులు డి.రంగన్న, సంబంధిత గుమాస్తా మరియు పాఠశాల వార్డన్ జి.శ్రీనివాసులు, ఆగమ పండితులు ఎం.శివయ్య, ఆంగ్ల ఉపాధ్యాయులు డి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



# దొంగ ఓట్ల తొలగింపుకు అందరూ కృషి చేయాలి.. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూల్ నగరంలో జరుగుతున్నటువంటి ఎస్.ఐ.ఆర్‌పై పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి సమావేశం జరిగింది ఈ సమావేశంలో మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణను నాయకులు, కార్యకర్తలు సీరియస్‌గా తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై వార్డు ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కో క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వార్డుల్లో మీ దృష్టికి వచ్చిన దొంగ ఓట్లను తొలగించేందుకు ఇది సరైన సమయం అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దొంగ ఓట్లను తొలగించేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ఇందులో తప్పకుండా భాగస్వామ్యం కావాలని మంత్రి సూచించారు. ఎలాంటి సందేహాలున్నా వెంటనే కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# 16 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్ గుప్తా

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూల్ నగరంలో పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రజలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గానికి చెందిన 16 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులు ఆయన పంపిణీ చేశారు. రామక్రిష్ణా రెడ్డి రూ.100358, మధురమణి రూ.441654, స్వప్న రూ.25541, మౌనిక రూ.51367, మాధవ క్రిష్ణ రూ.40184, పద్మశ్రీ రూ.37584, మనోహర్ రూ.52800, శ్రీనివాసరావు రూ.35000, మహమ్మద్ షబాజ్ ఖాన్ రూ.36800, మలాన్ బీ రూ.40384, చాకలి చంద్రశేఖర్ రూ.51200, సుధీర్ కుమార్ రూ.30000, ఉదయ్ కుమార్ రూ.67482, షేక్ బద్రున్నీసా రూ.41048, విజయ భాస్కర రాజు రూ.36733, బచ్చల ఉమా (బచ్చల సునీల్ కుమార్ రెడ్డి)రూ.752801ల చెక్కులు అందించారు. ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా ఉంటున్నట్లు టీజీ భరత్ గుప్తా తెలిపారు. సహాయం పొందిన వారు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ మేలు చేసేవిధంగా పనిచేస్తుందన్నారు. ఇప్పటి వరకు మొత్తం 188 మందికి రూ.1,85,29,563లు అందించామన్నారు. ఈ సందర్భంగా చెక్కులు తీసుకున్న వారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి టీజీ భరత్ గుప్తాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# మట్టి కోసం రైతుల సిగపట్లు

## మైనర్ ఇరిగేషన్ అధికారితో రైతుల వాగ్వాదం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 9 :** మట్టి కోసం రైతులు సిగపట్లు పట్టుకునే దుర్భరపు దారిద్రపు పరిస్థితులు నెలకొంటూ ఉన్నాయి. మట్టి తోలుకునే విషయంపై ఆ గ్రామంలో రెండు వర్గాల మధ్య ఆధిపత్యపు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సంఘటన పోలీసులు దృష్టికి రావడంతో పోలీసులు వెంటనే ఇ క్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమలకాల్వ గ్రామంలోని ప్రేమ చెరువులో తెలుగుదేశం పార్టీకి చెందినవారు ప్రోక్ లైనర్లు ఏర్పాటు చేసుకొని గత మూడు రోజుల నుండి పొలాలకు మట్టిని తరలించే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే ఈ మట్టిని తరలించే విషయంలో ట్రాక్టర్కు ఒక రేటు నిర్ణయించి ఆ ప్రకారంగా ప్రేమ చెరువు నుండి మట్టిని తరలిస్తున్నారు. పొలాలకైతే ఒక రేటు, గ్రామంలోకి అయితే ఇంకో రేటు ప్రకారం ధరను నిర్ణయించి అమ్ముతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టితోలే విషయంలో టి డి పి వారి పె త్తనాన్ని సహించలేని మరో వై సి పి వర్గం, తాము కూడా మట్టిని తరలించాలని ప్రయత్నాలు చేశారు. అయితే ఇందుకు అధికారుల నుండి అనుమతి లభించలేదు. అధికారుల నుండి అనుమతి రాకపోవడంతో, స్వయంగా వారే చెరువులోకి దిగి మంగళవారం నాడు మట్టితోనే ప్రయత్నాలు చేశారు. దీనితోటి డి పి వర్గం వారు అధికారుల నుండి ఒత్తిడి తెచ్చి మట్టిని తోలే ప్రయత్నాలకు ఫుల్ స్టాప్ పెట్టించాలని నిర్ణయించారు. వెంటనే మైనర్ ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ అర్జున్ సింగ్ మట్టిని తోలే ప్రయత్నాలను ఆపివేయాలని ఒత్తిడి చేసినట్లుగా మరో వై సి పి వారు చెప్తున్నారు. ఈ సంఘటన పోలీసుల దృష్టికి రావడంతో ఎస్ఐ జగన్మోహన్ పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం మధ్యాహ్నం వద్దకు చేరుకున్నారు.వారు మట్టిని తోలుకునేందుకు అనుమతి తెచ్చుకున్నారని మీరు కూడా అనుమతి తెచ్చుకొని మట్టిని తోలుకొండని మైనర్ ఇరిగేషన్ ఎ ఇ అర్జున్ సింగ్ వై సి పి వారికి చెప్పారు. ఈ విషయంలో వై సి పి వారు వినకపోవడంతో, ఎస్ ఐ జగన్ మోహన్ ఇరు వర్గాల వారిని పిలిపించి మట్టితోలే ప్రయత్నాలను విరమింప చేశారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని రైతులు, కొందరు వైసిపి నాయకులతో కలిసి మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. కలెక్టర్ సంబంధిత మైనర్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను కలవమని చెప్పిన మేరకు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వెంకటేశ్వరరావు ను కలిసి పరిస్థితిని గురించి వివరించారు. మట్టి తోలుకునేందుకు తమకు కూడా అనుమతి ఇస్తే తాము మట్టి తోలుకుంటామని ఇ ఇ కి చెప్పుకున్నారు. ఈ విషయంలో అనుమతి ఇచ్చేందుకు ఈఈ వెంకటేశ్వరరావు నిరాకరించడంతో రైతులకు కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. ఈ విషయంలో తాను అనుమతి ఇచ్చేది లేదంటూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ వెంకటేశ్వరరావు ఖరాఖండిగా చెప్పి అక్కడినుండి వెళ్లిపోయారు. రైతులు వైఎస్ఆర్ పార్టీకి చెందిన నాయకులు రైతులతో కలిసి తిరిగి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లేందుకు కార్యాలయం వద్ద తిష్ట వేసి కూర్చున్నారు. రైతుల మధ్య కలెక్టర్ కార్యాలయం వద్ద కూడా వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే మట్టి తరలించే విషయంలో తమను కూడా ఎస్సై నిలువరించే ప్రయత్నాన్ని చేసిన విషయాన్ని టిడిపి వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. అయితే బుధవారం మాత్రం చెరువు నుండి మట్టిని తరలించే తీరాలని టిడిపి వర్గీలు గట్టి నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం.



# కలసపాడు సర్వసభ్య సమావేశంలో సుప్రజ ప్రసంగం

**కలసపాడు, జూన్ 9: (నంది పత్రిక)**కలసపాడు మండల సర్వసభ్య సమావేశంలో బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా దేశవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా అమలవుతున్నాయని అన్నారు. బద్వేల్ నియోజకవర్గంలో జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతోందని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి నీటి సౌకర్యం, ఉపాధి హామీ పథకం, రైతులకు ఎరువుల సబ్సిడీలు, వ్యవసాయ పరికరాల పంపిణీ, మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేశ అభివృద్ధి, గ్రామీణ ప్రగతి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని ఆమె వెల్లడించారు.




printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# పెట్రోల్, డీజిల్,వంట గ్యాస్ నిత్యావసర వస్తువు ధరలు తగ్గించాలని సిపిఐ, సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

## నిత్యవసర వస్తువులు, డీజిల్, పెట్రోల్ గ్యాస్ బండను భుజాన పై మోస్తూ నిరసన

**పోరుమామిళ్ల, జూన్ 9 (నంది పత్రిక ):**డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ నిత్యవసర వస్తువుల రేట్లు తగ్గించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, సిపిఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ లు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరుమామిళ్ల గ్రామపంచాయతీ ఆఫీస్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డౌన్ డౌన్ అని నినాదాలతో హోరెత్తించారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యుద్ధం షాపుగా చూపించి, డీజిల్ పెట్రోల్ పెంచి, మరోసారి ఐదు రాష్ట్రాల ఎలక్షన్ అయిపోయింతవరకు ఎలాంటి రేట్లు పెంచమని ఓట్లు దండుకొని అందులోవెక్కిన తర్వాత ఐదుసార్లు డీజిల్, పెట్రోల్ వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజలు బతకలేని విధముగా నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు చాలా బాధాకరమన్నారు

ఈరోజు భారతదేశంలో మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా, దుశ్శాసనను లాగా ప్రజలను ఒకపక్క పీడించి, మరొకపక్క మతోన్మాదాన్ని పోషించి ప్రజలను జలగల్లా పీడించడం సిగ్గుచేటు అన్నారు. అలాగే కూరగాయల రేట్లు, నిత్యవసర వస్తువులు, రవాణా చార్జీలు, ట్రాన్స్ పోర్ట్ రంగం ఎక్కడి వాహనాలు లారీలు, ఆల్వేన్లు ఆటోలు ఫైనాన్స్ వాళ్లకు అప్పుజెప్పాల్సిన పరిస్థితి నెలకొన్నది. పెరిగిన రేట్లు హోటల్ యజమానులు గ్యాస్ కొనలేక అర కోర హోటల్లో ఉంటే రెండు ఇడ్లీ 30 రూపాయలు, దోష నలభై ఈ విధంగా అన్ని రేట్లు పెరిగిపోవడం జరిగింది. వ్యవస్థ అంతా నాశమైపోవడానికి ప్రధాన కారణమైన నరేంద్ర మోడీ, ప్రభుత్వం ప్రజలు పడే బాధలు, వారు పడే అగసాట్లు ఏవి కూడా కళ్ళు ఉంది చూడలేని గుడ్డివాడిలాగా, చెవులుంది వినలేని చెవిటి వాడిలాగా వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరం ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అనుగుణంగా నిత్యవసర వస్తువుల రేట్లు తీసుకురావాలని, డీజిల్ పెట్రోల్ గ్యాస్ రేట్లు తగ్గించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తానని




కూటమి ప్రభుత్వాన్ని వామపక్ష పార్టీలు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి కేశవ, సఫా పిరయ్య , సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గౌస్య బేగం, మండల నాయకులు సోమయ్య రవి, ఇసాక్, షాహిదా, జాకోబ్, మేరీ, అలీ భాష, చంద్ర, రఫీ అధిక సంఖ్యలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## విశాఖ ఉక్కు కర్మకారంలో జరిగిన సంఘటనకు దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** విశాఖ ఉక్కు కర్మాగారంలో స్టీల్ మెల్టింగ్ షాప్ - 1 లోని కంటిన్యూయస్ క్యాస్టింగ్ డిపార్ట్మెంట్ మిషన్ -2 వద్ద 150 టన్నుల ద్రవరూప ఉక్కును తరలిస్తుండగా ల్యాడల్ ఒక్కసారిగా పెలిపోవడంతో సుమారు 1500 డిగ్రీల సెల్సియస్ అత్యధిక ఉష్ణోగ్రతతో కూడిన ద్రవ ఉక్కు ఒలకడంతో, ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న 8 మంది కార్మికులు మృతి చెందడం బాధాకరమని కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ తన ప్రగాడ సంతాపం తెలియజేశారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరారు. దుర్ఘటన జరిగిన వెంటనె రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు సంభందిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, అక్కడి పరిస్తితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సహాయ చర్యలు జరిగేలా చూశారని అన్నారు. అలాగే తెలుగుదేశంపార్టీ నారా లోకేష్, పవన్ కళ్యాన్ పల్లా శ్రీనివస్ , మరియు మంత్రులు, ఎం.ఎల్.ఏలు ఘటన స్థలికి చేరుకొని సంఘటనా స్థలిని పరిశీలించి ఇలాంటివి పునారవృతం కాకుండా అధికారులతో మాట్లాడి వారికి తగిన ఆదేశాలు ఇచ్చారని అన్నారు. ఈ గొడ్డలి పార్టీ నాయకులు శవాల కోసం ఎదురుచూస్తున్నట్లుగా ఉన్నారని, ఈ రోజు ప్రమాద స్థలికి చేరుకొని రభస చేయడం బాధాకరం, ఈ ఘటనలో మృతి చెందిన వారి కుంటుంభానికి ప్రభుత్వం తరపున 25 లక్షలు, క్షతగాత్రులకు 10 లక్షల రూపాయలు, కుటుంభంలోని సభ్యులకు ఒక ఉద్యోగం ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. వైసిపి శవ రాజకీయాలు మానేసి బాధితులకు అండగా ఉండాలని, శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం పై నిందలు వేయాలనె తపన తపితే ఇంకో ఆలోచన గొడ్డలి పార్టీ నాయకులకు లేదని అన్నారు. ప్రతిపక్ష హోదా లేకపోయిన గొడ్డలి పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వం పై నిందలు వేయడం నీచమైన చర్య అని, ఇప్పటికైన శవరాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కూటమి నాయకులు బాధిత కుటుంభాలకు ధైర్యం నింపే ప్రయత్నం చేశారని అన్నారు.

## చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచి రెండేళ్ల.. మాజీ ఎమ్మెల్యే కాటసాని నల్ల బెలూన్ వదిలి నిరసన




**బనగానపల్లె జూన్ 9 నందిపత్రిక** చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచి రెండేళ్లయిందని వైసీపీ మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి అన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణం ఓ ఫంక్షన్ హాల్ నందు చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా చర్చా వేదిక నిర్వహించి ఆర్ట్ గ్యాలరి ప్రదర్శించి నల్ల బెలూన్ లను వదిలి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచి రెండేళ్లు అయితే,మామ ఎన్ టి ఆర్ కు వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కొని వెన్నుపోటు పొడిచి 30 ఏళ్లు అయిందని ఈ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తు పబ్బం గడుపుకొంటున్నదని,సంబంధం లేని విషయాల్లో జైళ్లకు పంపుతున్న సంస్కృతి కూటమి పార్టీ నైజం అని అన్నారు.కార్యక్రమం లో అత్తార్ జాహీద్ హుస్సేన్,గుండం నాగేశ్వర్ రెడ్డి,సిద్ధంరెడ్డి రామ్ మోహన్ రెడ్డి,బీవీ నాగార్జున రెడ్డి,అబ్దుల్ ఫైజ్, సన్నల జనార్ధన్ రెడ్డి,తోటబుచ్చిరెడ్డి,అంబటి రవి రెడ్డి ఇతర వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. తెలంగాణకు చెందిన ముగ్గురు సహా ఏడుగురు మృతి

ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దుబాయ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణలోని జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులతో సహా మొత్తం ఏడుగురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. దుబాయ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమిరేట్స్ రోడ్డుపై సాంకేతిక లోపం తలెత్తడంతో ఓ ట్రక్కు రహదారి పక్కన నిలిచిపోయింది. అదే సమయంలో కార్మికులతో వేగంగా వచ్చిన ఓ మినీ బస్సు ఆ ట్రక్కును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులోని ఏడుగురు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆసుపత్రులకు తరలించగా, వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# ఆళ్లగడ్డ లో 'వెన్నుపోటుకు రెండేళ్ళు' నిరసన,

## వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ అభివృద్ధిని ప్రజలు గుర్తు పెట్టుకుంటున్నారు

## మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 9,నంది పత్రిక** కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నమ్మించి వెన్నుపోటు పొడిచిందిఅని మాజీ శాసన మండలి సభ్యులు, మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఆళ్ళగడ్డలోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలో "వెన్నుపోటుకు రెండేళ్ళు" పేరిట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముందు కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నల్ల బెలూన్లను గాల్లోకి ఎగురవేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను బట్టబయలు చేస్తూ కార్యాలయం ఆవరణంలో ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్ అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను, మహిళలను, రైతులను మోసం చేసిందనీ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, రైతులకు పెట్టుబడి సాయం వంటి పథకాలను అటకెక్కించి ప్రజల వీపున వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నా రన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆళ్ళగడ్డ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు ఆళ్లగడ్డ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం , వైస్సార్ ముస్లిం నాయకులు షేక్ బాబు లాల్,సింగం వెంకటేశ్వర రెడ్డి,అంబటి మహేశ్వర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, పలుసాని మల్లికార్జునరెడ్డి, మాదం చెన్నయ్య, మాదం కిషోర్, వైఎస్ఆర్సిపి, ఈఅనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## విశాఖ ఉక్కు దుర్ఘటన మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ




**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలని గాయపడిన వారికి 50 లక్షలు మృతుల కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు బోయ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐఎన్టియుసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో క్రాంతి నాయుడు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ లో దుర్ఘటన జరిగి పదిమంది వరకు ప్రాణాలు కోల్పోయారు . రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించకుండా కార్మికులకు ఎక్కడ కూడా రక్షణ దొరకని పరిస్థితి వచ్చిందనీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దీని మీద ఆలోచన చేయాలి. విశాఖ స్టీల్ ప్లాంట్ ను జాతీయం చేయాలని మన రాష్ట్రానికి వెన్నముక లాంటిదని ఇలాంటివి స్టీల్ ప్లాంట్ లు, ఫ్యాక్టరీలు, పరిశ్రమలు స్థాపించుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ప్రస్తుతం ఉన్న ఎన్డీఏ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదనీ కార్మికులకు సరైన సదుపాయాలు లేవు వాళ్లు పని చేసే చోట వాళ్లకే రావాల్సిన హక్కులు రావడం లేదు ఇన్సూరెన్స్ లు, హాస్పిటల్ బిల్స్ కానివ్వండి హెల్త్ పరంగా కానివ్వండి ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోవడం లేదు. దీని మీద ఒక ఆలోచన చేయమని ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కోటి రూపాయలు, గాయపడిన వారికి 50 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా ఉండాలని అదే స్టీల్ ప్లాంట్లో ఏదైనా ఉద్యోగం ఇవ్వాలని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరఫున డిమాండ్ చేస్తున్నామని క్రాంతి నాయుడు బోయ తెలియజేశారు. అనంతరం ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన సంఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మంత్రి నారా లోకేష్ కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోరుచున్నామని గాయపడిన వారికి 50 లక్షలు, చనిపోయిన వారి కుటుంబాలకు 1 కోటి రూపాయలు వరకు ప్రభుత్వం సహాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వాలు ఇటువంటి బ్లాస్టింగ్ జరిగినపుడు కార్మికులకు ఎక్స్ గ్రేషియా ప్రకటించాయని కూటమి ప్రభుత్వం కూడా అదేవిధంగా ఇవ్వాలని ఐఎన్టియుసి కార్మిక సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నామని బతకన్న తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, ప్రధాన కార్యదర్శి సురేష్, డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజుద్దీన్, వార్డు ఇన్చార్జి హుస్సేన్ ఐఎన్టీయూసీ నాయకులు పౌల్ మొదలగువారు పాల్గొన్నారు.

## మిడెన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ క్యాంపస్ నియామక డ్రైవ్‌లో 14 మంది విద్యార్థుల ఎంపిక



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 09 ( నంది పత్రిక )** శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), నంద్యాల వారి ఆధ్వర్యంలో మిడెన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించింది.ఈ నియామక కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డా. జి. రామకృష్ణ రెడ్డి, డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.బి.వి. సుబ్బయ్య, విభాగాధిపతి డా. యు.వి.ఎస్. కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు కె. సంపత్ మరియు ఎస్. ఇంతియాజ్ అహమ్మద్ పర్యవేక్షణ అందించారు. కంపెనీ తరఫున మామిళ్ల సుభాష్ (జనరల్ మేనేజర్), యదు బాలకృష్ణన్ (అసిస్టెంట్ మేనేజర్), మనోహర్ రెడ్డి (అసోసియేట్ మేనేజర్) మరియు థిమేష్ (టీమ్ లీడ్) పాల్గొని నియామక ప్రక్రియను నిర్వహించారు.ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో డిగ్రీ మరియు పీజీ కోర్సులకు చెందిన మొత్తం 95 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా ఫేస్-టు-ఫేస్ ఇంటర్వ్యూ మరియు హెచ్‌ఆర్ రౌండ్ అనే రెండు దశలను నిర్వహించారు. మొదటి దశలో జరిగిన ఫేస్-టు-ఫేస్ ఇంటర్వ్యూలో 45 మంది విద్యార్థులు అర్హత సాధించి హెచ్‌ఆర్ రౌండ్‌కు ఎంపికయ్యారు. అనంతరం జరిగిన హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబరిచిన 14 మంది విద్యార్థులు మిడెన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కు ఎంపిక అయ్యారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. జి. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించేలా కళాశాల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.ప్రిన్సిపాల్ కె.బి.వి. సుబ్బయ్య, విభాగాధిపతి డా. యు.వి.ఎస్. కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు కె. సంపత్ మరియు ఎస్. ఇంతియాజ్ అహమ్మద్‌లు ఎంపికైన విద్యార్థులను అభినందించి, ఈ అవకాశాన్ని కల్పించిన మిడెన్ ల్యాబ్స్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), నంద్యాల




## ఆంధ్ర జ్యోతి రిపోర్టర్ జయరాజు పై దాడికి ప్రయత్నించిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలి



**కర్నూలు, జూన్ 09: నంది పత్రిక:** భూ కబ్జాలపై వార్తలు రాస్తే జీర్ణించుకోలేని కబ్జాదారులు మంత్రాలయం రిపోర్టర్ జయరాజుపై దాడికి ప్రయత్నించడం సిగ్గుచేటని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (×జీఖ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు ఎన్ వెంకట సుబ్బయ్య, కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర సమితి సభ్యులు వైవీ కృష్ణా రెడ్డి, భాష్యం మధు సుధన్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజి, జిల్లా సహాయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, వెంకటేష్, ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, చిరంజీవి డిమాండ్ చేశారు. మంత్రాలయం సమీపంలో తుంగభద్ర నదీ సమీపంలో బఫర్ జోన్ భూమిని ఆక్రమించి వెంచర్ వేసి అమ్ముకుంటున్న విషయం తెలుసుకొని వరుస కథనాలు ఆంధ్ర జ్యోతి పేపర్ లో రాయడం జరిగిందన్నారు. దీంతో అధికారులు స్పందించి వంక ఫోరం బోకు భూమిలో ఏర్పాటు చేసిన ప్రహరీ గోడను కూల్చేసేందుకు నోటీసులు ఇచ్చారన్నారు. అంతేకాక కూల్చివేతకు రావడంతో అధికారులు రావడంతో జయరాజ్ తో పాటు మరికొంత మంది జర్నలిస్టులు కబ్జా చేసిన ప్రాంతానికి వెళ్లారన్నారు. అయితే అక్కడే ఉన్న కబ్జాదారులు జయరాజ్ పై బూతు పురాణం అందుకోవడమే కాకుండా దాడికి ప్రయత్నించడం దుర్మార్గం అన్నారు. తప్పులు ఎత్తి చూపితే ఇలా దాడులకు పాల్పడే సంస్కృతి ఇటీవల పెరిగిపోయిందని చెప్పారు. జయరాజ్ పై దాడికి ప్రయత్నించిన కబ్జాదారులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జయరాజ్ కు భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తగిన భద్రత కల్పించాలని కోరారు. జర్నలిస్టుల పై దాడులు, బెదిరింపులు రోజు రోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి డిమాండ్ చేశారు. దాడుల నివారణకు యాంటి ఎటాక్ కమిటీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## అర్ధరాత్రి డ్రాప్ చేయాలన్న యువతి.. పోలీసుల సమాధానంతో షాక్!




హైదరాబాద్‌లోని లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో మంగళవారం తెల్లవారుజామున తనకు ఎదురైన చేదు అనుభవంపై ఓ యువతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న తనను ఇంటి వద్ద దింపాలని కోరగా పోలీసులు నిరాకరించారని ఆమె ఆరోపించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, నగరంలో మహిళల భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. విజయవాడ నుంచి రైలులో బయలుదేరిన సదరు యువతి, రైలు ఆలస్యం కావడంతో మంగళవారం తెల్లవారుజామున 1:45 గంటలకు లింగంపల్లి స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో ఒంటరిగా ప్రయాణించడం క్షేమకరం కాదని భావించిన ఆమె, పోలీసు హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సహాయం కోరింది. అయితే, ప్రయాణికులను ఇళ్ల వద్ద దింపే నిబంధన ఏదీ తమ వద్ద లేదని అధికారులు స్పష్టం చేసినట్లు ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న వీడియోలో వాపోయింది. ఈ ఘటనతో హైదరాబాద్‌లో రాత్రి సమయాల్లో మహిళల ప్రయాణ భద్రత అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కొద్ది రోజుల క్రితమే మల్కాజ్‌గిరి కమిషనర్ బి. సుమతి స్వయంగా మారువేషంలో బస్టాప్‌లో నిలబడి మహిళల భద్రతపై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన నేపథ్యంలో, ఈ తాజా ఉదంతం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో తెలంగాణ పోలీసులు ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న మహిళలు, వృద్ధులకు మానవతా దృక్పథంతో సహాయం అందించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే, ప్రయాణికులకు ఉచితంగా రైడ్స్ ఇవ్వడం లేదా ఇళ్ల వద్ద దింపడం తమ అధికారిక విధివిధానాల్లో భాగం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## ప్రతి ఇంటి వద్ద చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపడుతున్నాం.

### కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.



**తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 9నంది పత్రిక** ప్రతి ఇంటి ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ చక్కగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలిపారు. నగరంలో చెత్త సేకరణ కొరకు నూతనంగా కొనుగోలు చేసిన రెండు ఆటోలను కమిషనర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చెత్త సేకరణ జరుతున్న సమయంలో వాహనాలు బ్రేక్ డౌన్ అయిన సమస్యంలో ఇబ్బందులు రాకుండా అన్ని వీధుల్లోకి వెళ్లేలా చేస్తున్నామని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో సమగ్రంగా చెత్త సేకరణ చేసేందుకు వీలుగా కొత్త వాహనాలు కొనుగోలు చేశామని తెలిపారు. కాలువల్లో, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి, వాహనాలకు చెత్త నగర పరిశుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ ఇంజనీర్ గోమతి, డి.ఈ.రమణ, తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను అత్యంత ప్రేమ, శ్రద్ధతో చూసుకోవాలి





### 326 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత సహాయక పరికరాల పంపిణీ

### ఘనంగా నిర్వహించిన సమగ్ర శిక్ష సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 9,నంది పత్రిక** ప్రత్యేక అవసరాలు (దివ్యాంగులు) గల విద్యార్థులను అత్యంత ప్రేమ, శ్రద్ధతో ఆదరించి వారి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. మంగళవారం భీమవరం పట్టణంలోని పిపి రోడ్‌లో ఉన్న ప్రత్యేక మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో పాఠశాల విద్య సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమం"లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు సమాజానికి అమూల్యమైన సంపద అని, వారి శారీరక పరిమితులు వారి ప్రతిభను ఎప్పటికీ అడ్డుకోలేవని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ స్వప్నాలను సాకారం చేసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం విద్య, వైద్యం, పునరావాసం, సహాయక పరికరాలు, ప్రత్యేక శిక్షణ తదితర రంగాల్లో పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక శిక్షణ అందిస్తూ పిల్లల సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న దివ్యాంగుల పాఠశాలలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని అభిప్రాయపడ్డారు.సమగ్ర శిక్ష ఏపీసీ పి.శ్యాంసుందర్ మాట్లాడుతూ జిల్లాలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సహిత విద్య కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 19 మండలాల్లో భవిత కేంద్రాలు నిర్వహిస్తున్నామని, ఆర్పీడబ్ల్యూడీ చట్టం2016 ప్రకారం 0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల మానసిక, బధిర, అంధత్వం, శారీరక తదితర 21 రకాల వైకల్యాలు గల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. దివ్యాంగ పిల్లల ప్రజ్ఞా స్థాయిలకు అనుగుణంగా విద్యాబోధన నిర్వహిస్తున్నామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సమగ్ర శిక్ష ద్వారా రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్, హెచ్‌బీఈ అలవెన్స్, గర్ల్స్ స్టైఫండ్ తదితర పథకాల కింద రూ.61 లక్షలను నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను క్షేత్రస్థాయిలో గుర్తించి, వైద్య నిపుణులు మరియు ప్రత్యేక విద్యా నిపుణుల సూచనల మేరకు వారికి అవసరమైన సహాయక పరికరాలను ఎంపిక చేసి అందిస్తున్నామని తెలిపారు. ఈ పరికరాలు విద్యార్థుల విద్యాభ్యాసాన్ని సులభతరం చేయడంతో పాటు వారి దైనందిన జీవితంలో స్వతంత్రతను పెంపొందించేందుకు దోహదపడతాయని వివరించారు. అనంతరం నిర్వహించిన ఉచిత సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమంలో 326 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా డిజిటల్ హియరింగ్ ఎయిడ్స్, కమోడ్ వీల్‌చైర్లు, వీల్‌చైర్లు, టీఎల్ఎం కిట్లు, క్రచ్‌లు, ట్రైసైకిళ్లు, స్క్రీన్ రీడర్‌తో కూడిన స్మార్ట్‌ఫోన్లు, బ్రెయిల్ కిట్లు తదితర పరికరాలను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి తల్లిదండ్రుల యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం విశేషంగా ఆకట్టుకుంది. తమ పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా నిలవడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతూ, వారి కలలకు కొత్త రెక్కలు తొడిగే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమం అత్యంత విజయవంతంగా జరిగింది. కార్యక్రమ ప్రాంగణం చిన్నారుల ఆనంద కేరింతలు, తల్లిదండ్రుల సంతోషం, ఉపాధ్యాయుల అభినందనలతో ప్రత్యేక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, సమగ్ర శిక్ష డిటిసిలు దీవెనమ్మ, చంద్రశేఖర్, ఎంఈఓలు, సమగ్ర శిక్ష అభియాన్ అకౌంట్స్ అధికారులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఇతర అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







## జలసమర దీక్షను జయప్రదం చేయండి ::కర్నూల్ ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ హర్ష



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కోడుమూరు పట్టణంలో ఈనెల 11వ తేదీన జల సమర దీక్షను చేపడు తున్నట్లు కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష తెలిపారు. గుండ్రేవుల ప్రాజెక్టు ప్రతిపాద ఇంజనీర్ కుడు, రిటైర్డు ఎస్.సుబ్బరాయుడు మృతిని తాగునీరు - సాగునీటిని అందించే గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకై ఈ దీక్షను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. 11వ తేదీ గురువారం ఉదయం 9.30 గంటలకు కోడుమూరు పాతబస్టాండ్ పత్రప్ప కాంప్లెక్స్ దగ్గర ఏర్పాటుచేస్తున్న జలసమర దీక్షను రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మిస్తే కర్నూలు ప్రాంతంలో దాదాపు 10 లక్షల మందికి తాగునీటి సమస్య, జిల్లా పశ్చిమ ప్రాంత రైతాంగానికి కొన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని శ్రీహర్ష తెలిపారు. అదేవిధంగా కర్నూలు ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగం ఉంటుందని, యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని శ్రీహర్ష తెలిపారు. తుంగభద్ర డ్యాం నుండి వదిలిన నీరు సుంకేసుల బ్యారేజీ ద్వారా సగటున 150 టీఎంసీల నీరు దిగువకు వెళ్లిపోతున్నాయని, ఇటీవల కాలంలో దాదాపు 300 టీఎంసీలు వృధాగా దిగవకు వదిలివేశారని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. రాష్ట్రం విడిపోయాక కొన్నేళ్లకే జిల్లాలు కూడా విడిపోవడంతో వెనుకబడి ఉన్న కర్నూలు జిల్లా అభివృద్ధికి గుండెకాయ లాంటి గుండ్రేవుల ప్రాజెక్టు కోసం కర్నూలు ప్రగతి సమితి పోరాటం చేస్తుందని శ్రీహర్ష తెలిపారు. మన నీటిని మనం నిల్వ చేసుకోవడానికి రూపుదిద్దుకునే గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు ప్రతిఒక్కరూ కలిసిరావాలని శ్రీహర్ష పిలుపునిచ్చారు.

## రైతులకు పట్టాదార్ పాస్ బుక్కుల పంపిణీ చేసిన మంత్రి

**బనగానపల్లె జూన్ 9నందిపత్రిక** మండల పరిధిలోని బీరవోలు గ్రామంలో మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు.అదేవిదంగా బీరవోలు గ్రామంలో దాదాపు రూ. 65 లక్షలు వెచ్చించి నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను ప్రారంభించారు.బీరవోలు గ్రామం హౌసింగ్ కాలనీలో రూ. 29 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు మరియు డ్రైయిన్ లు ప్రారంభించిన మంత్రి దళిత కాలనీలో రూ. 20 లక్షలతో ఆర్ అండ్ బి రోడ్డు నుంచి నిర్మించిన సీసీ రోడ్ మరియు డ్రైయిన్ ప్రారంభించిన మంత్రి పాత బీరవోలు గ్రామంలో ఎంపీపీ స్కూల్ నుంచి రూ. 16 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును కూడ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో రైతులు ప్రజలు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు. పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్ల పాలనలో బీరవోలు పం2019చాయితీ లో రూ. 68.7 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# యోగాంధ్ర2026 కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలి

**అన్ని శాఖల సమన్వయంతో లక్ష్య సాధనకు కృషి చేయాలి**

**జూన్ 11వ తేదీన నరసాపురం వలందర్ రేవు వద్ద 1000 మందితో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమం**

**జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 9నంది పత్రిక** యోగాంధ్ర2026 కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి యోగాంధ్ర2026 కార్యక్రమంపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4.5 లక్షల మంది పౌరులతో యోగ రిజిస్ట్రేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ లక్ష్య సాధనలో అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమిష్టిగా కృషి చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యోగ కేంద్రాలు, యోగపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. యోగాభ్యాసం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని తెలిపారు.




యోగా ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసే విధంగా గ్రామ, మండల, పట్టణ స్థాయిలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 7వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహణకు ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కూడా ప్రతిరోజు గ్రామ, మండల, పురపాలక సంఘాల పరిధిలో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు భాగస్వాములై కార్యక్రమాలను మరింత విజయవంతం చేయాలని కోరారు. జూన్ 14న వాసవి పెనుగొండలో 2500 మందితో, జూన్ 19న స్పోర్ట్స్ అథ్లెటిక్స్ మైదానంలో 1500 మందితో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో 1500 మందితో మెగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా గ్రామ, మండల, డివిజన్ స్థాయిలలో యోగాసనాలు, క్విజ్, పెయింటింగ్, వ్యాసరచన తదితర అంశాలపై వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలని సూచించారు. జిల్లాలో నిర్వహించే యోగా కార్యక్రమాలకు సంబంధించిన నాణ్యమైన ఫోటోలను యోగాంధ్ర యాప్‌లో అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు భాగస్వాములై యోగాంధ్ర2026 కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు..

# చేపల మందు పంపిణీలో బజరంగ్ సేన



నాంపల్లి లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బతిని గౌడ్ కుటుంబం నిర్వహించిన వార్షిక చేపల మందు పంపిణీ కార్యక్రమంలో బజరంగ్ సేన తెలంగాణ ప్రతినిధులు పాల్గొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ రావు, నగర అధ్యక్షుడు మనోజ్ మొగల్గిద్ది పాల్గొని దేశవ్యాప్తంగా వచ్చిన రోగులకు స్వయంగా సాంప్రదాయ చేపల మందును అందించారు. ఆతిథ్యానికి, ఆప్యాయతకు చిహ్నంగా, ఈ కార్యక్రమానికి హాజరైన రోగులందరికీ టొమాటో బాత్ పంపిణీ చేశారు. ఈ గొప్ప సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతున్నందుకు నాయకులు బతిని గౌడ్ కుటుంబాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉన్న రోగులు, భక్తులతో ఆత్మీయంగా ముచ్చటించారు. మన సమాజాలకు సేవ చేస్తూ, వాటిని బలోపేతం చేసే సాంప్రదాయ పద్ధతులను పరిరక్షించాల్సిన ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా రామేశ్వర్ మిశ్రా, కొండారెడ్డి, శ్రీనివాస్ హాజరై కార్యక్రమానికి తమ మద్దతును అందించారు. ఈ విశిష్టమైన వార్షిక కార్యక్రమంపై కొనసాగుతున్న నమ్మకానికి, విశ్వాసానికి నిదర్శనంగా పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు అయ్యారని తెలిపారు.



# వర్జీనియా పొగాకు రైతులు, కంపెనీల సమన్వయంతోనే మార్కెట్‌కు స్థిరత్వం

**- కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ.. కేంద్ర ప్రభుత్వంతో విస్తృత చర్చలు**

**- ఎగుమతిదారులకు వడ్డీ రాయితీ పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్రం**

**- రోజువారీ కొనుగోళ్లు 150 బేళ్ల నుంచి 700 బేళ్లకు పెరుగుదల... త్వరలో 1200 బేళ్ల లక్ష్యం**

**- రైతులు అన్ని గ్రేడ్ల పొగాకును ఒకేసారి మార్కెట్‌కు తీసుకురావాలి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి,బ్యూరో చీఫ్ జూన్ 9:నంది పత్రిక** వర్జీనియా పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి సమన్వయంతో పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా, కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ కేంద్ర ప్రభుత్వం, పొగాకు బోర్డు ఉన్నతాధికారులతో నిరంతర సంప్రదింపుల వలన పొగాకు బోర్డు ఈడీ, చైర్మన్ లకు కేంద్ర ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయటంతో పొగాకు మార్కెట్ పరిస్థితులు, కొనుగోళ్ల పురోగతి, ఎగుమతుల స్థితిగతులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం పొగాకు బోర్డు చైర్మన్ ఆధ్వర్యంలో రైతులు, కొనుగోలు సంస్థలతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. రైతులు, కంపెనీల అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలించి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతం చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. అదే క్రమంలో పొగాకు బోర్డు చైర్మన్ మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ్ తో పాటు సంబంధిత ఉన్నతాధికారులను కలుసుకుని వర్జీనియా పొగాకు రైతుల పరిస్థితిని వివరించినట్లు చెప్పారు. రైతుల సమస్యలపై సానుకూల దృక్పథంతో స్పందించాలని కోరినట్లు వెల్లడించారు.గత 15 రోజుల క్రితం మార్కెట్‌లో రోజుకు సుమారు 150 బేళ్ల స్థాయిలో మాత్రమే కొనుగోళ్లు జరిగేవని, ప్రభుత్వం తీసుకున్న చర్యలు, రైతులు, కంపెనీల మధ్య సమన్వయంతో ప్రస్తుతం ఇది సగటుగా 700 బేళ్లకు పెరిగిందని మంత్రి తెలిపారు. ఈ ధోరణి కొనసాగితే వచ్చే వారం రోజుల్లో రోజుకు 1000 నుంచి 1200 బేళ్ల వరకు కొనుగోళ్లు చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కంపెనీలు అవసరమైన గ్రేడ్ల వివరాలను సమావేశంలో తెలియజేశాయని, వాటి ఆధారంగా వారంవారీ కొనుగోలు లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. రైతులు అన్ని గ్రేడ్లను సమానంగా మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. అన్ని గ్రేడ్ల సమగ్ర ప్రవాహం ఉంటే కొనుగోళ్లు మరింత సాఫీగా జరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అయ్యే పొగాకులో 30 శాతం దేశీయ వినియోగానికి వెళ్లగా, 70 శాతం ఎగుమతులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. అంతర్జాతీయ పరిణామాలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, రవాణా సమస్యలు, షిప్పింగ్ కంటైనర్ల కొరత వంటి కారణాలతో ఎగుమతి రంగం ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కంటైనర్ రవాణా ఖర్చు సుమారు 1600 డాలర్ల నుంచి 4000 డాలర్ల వరకు పెరిగినట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో జీఎస్టీ భారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి విజ్ఞప్తి చేశారని మంత్రి చెప్పారు. అలాగే ఎగుమతిదారులకు వడ్డీ రాయితీ (ఇంటరెస్ట్ సబవెన్షన్ ) కల్పించాలన్న ప్రతిపాదనపై కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య శాఖతో కూడా చర్చలు కొనసాగనున్నాయని తెలిపారు. రైతులు, కంపెనీలు, ఎగుమతిదారులు ఒకే వేదికపై కలిసి పనిచేస్తేనే ప్రస్తుత సవాళ్లను అధిగమించగలమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# విజయవంతంగా ఫిట్‌ఫార్ములా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ ఎడిషన్ 2



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సహకారంతో ఫిట్‌ఫార్ములా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ ఎడిషన్ 2 ను జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 250 మంది ఈతగాళ్లు పాల్గొని క్రీడాస్ఫూర్తి, ఫిట్‌నెస్, సమానత్వం, పోటీతత్వాన్ని చాటిచెప్పారు. ఈ ఏడాది ఛాంపియన్‌షిప్ లో ప్రత్యేక ఆకర్షణగా హైదరాబాద్ నగరంలో తొలిసారిగా మేధో వికలాంగత, ఆటిజం ఉన్న చిన్నారుల కోసం ప్రత్యేక స్విమ్మింగ్ పోటీలను నిర్వహించారు. ఇందులో సుమారు 50 మంది ప్రత్యేక కేటగిరీ ఈతగాళ్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను, ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించారు. స్విమ్మింగ్ క్రీడాభివృద్ధి, ఫిట్‌నెస్ ప్రోత్సాహం, ప్రతి చిన్నారికి సమాన క్రీడా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో వినోద్ పాస్వాన్ స్థాపించిన ఫిట్‌ఫార్ములా సంస్థ ఆధ్వర్యంలో సహ వ్యవస్థాపకురాలు మేఘా తార్సే నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కె.శివసేన రెడ్డి కి వారి అమూల్యమైన సహకారం, ప్రోత్సాహానికి ఫిట్‌ఫార్ములా సంస్థ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ముఖ్య అతిథిగా విచ్చేసి యువ క్రీడాకారులను ప్రోత్సహించిన వాకిటి శ్రీహరి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, స్విమ్మింగ్ కోచ్ ఆయుష్ యాదవ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సిబ్బంది, సాంకేతిక అధికారులు, రిఫరీలు, వాలంటీర్లు, కోచ్‌లు, లైఫ్‌గార్డులు, ఫిట్‌ఫార్ములా సిబ్బంది అందరికీ వారి కృషి, అంకితభావానికి ప్రత్యేక అభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమ విజయవంతానికి తోడ్పడిన స్పాన్సర్లకు ఫిట్‌ఫార్ములా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. హేమాంగి హాస్పిటల్ టైటిల్ స్పాన్సర్ న్యూ హోప్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ అసోసియేట్ స్పాన్సర్ వారి ఉదార సహకారం వల్ల ఈ ఛాంపియన్‌షిప్ పాల్గొన్న ప్రతి ఒక్కరికీ చిరస్మరణీయ అనుభవంగా నిలిచింది. పోటీల ముగింపు సందర్భంగా ఘనంగా పతకాల ప్రదానోత్సవం నిర్వహించి విజేతలను సత్కరించారు. ఈ కార్యక్రమ విజయానికి సహకరించిన క్రీడాకారులు, విజేతలు, తల్లిదండ్రులు, కోచ్‌లు, అధికారులు, వాలంటీర్లు, మద్దతుదారులందరికీ ఫిట్‌ఫార్ములా అభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఫిట్‌ఫార్ములా వ్యవస్థాపకులు, వినోద్ పాస్వాన్, సహ వ్యవస్థాపకురాలు మేఘా తార్సే, డైరెక్టర్ సంజయ్ సోనార్, ఫిట్‌ఫార్ములా సభ్యులు పాల్గొన్నారు.

### ఉత్తమ ప్రతిభా పురస్కార విజేతలు..

అండర్-8 బాలురు: హయంత్ 4 బంగారు పతకాలు
అండర్-8 బాలికలు: పౌష్ణ 2 బంగారు పతకాలు
అండర్-10 బాలికలు: ఆర్ణ 4 బంగారు పతకాలు
అండర్-12 బాలికలు: మానస్విని 2 బంగారు పతకాలు
అండర్-12 బాలురు: రుధ్వి 2 బంగారు పతకాలు
అండర్-14 బాలురు: ప్రదిత్ 4 బంగారు పతకాలు
అండర్-14 బాలికలు: పాలిని 4 బంగారు పతకాలు
అండర్-16 బాలికలు: అద్విక 2 బంగారు పతకాలు
అండర్-18 బాలికలు: సాత్విక 4 బంగారు పతకాలు
18 ఏళ్లు పైబడిన బాలురు: జైజీత్ 2 బంగారు పతకాలు

# వైసీపీ విష ప్రచారాలను రైతులు నమ్మొద్దు.. దుష్ప్రచారం చేస్తే జైలుకే:

**మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక**

**అమరావతిబ్యూరో చీఫ్ , జూన్ 9 నంది పత్రిక** తోతపూరి మామిడి రైతులను తప్పుదోవ పట్టిస్తూ వైసీపీ అనుబంధ సోషల్ మీడియా వర్గాలు, కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు చేస్తున్న విష ప్రచారాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి కొనుగోళ్లు, పల్ప్ పరిశ్రమలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల్లో అసత్యాలు ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. రైతుల్లో అయోమయం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే కుట్రలో భాగంగానే ఈ తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వైసీపీ మరోసారి తన నీచమైన, దిగజారుడు రాజకీయాలకు తెరలేపిందని మంత్రి విమర్శించారు. రైతుల సంక్షేమం వంటి సున్నితమైన అంశాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించడం, ప్రభుత్వంపై బురదజల్లడం, అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించడం వైసీపీకి అలవాటుగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఎవరు ఎంత దుష్ప్రచారం చేసినా ప్రభుత్వం రైతుల పక్షానే నిలుస్తుంది. ఆధారాలు లేకుండా అబద్ధాలు సృష్టించి వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో వైరల్ చేస్తే సహించేది లేదు. అలాంటి వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తాం అని మంత్రి హెచ్చరించారు. గత ఏడాది మామిడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. రైతులకు నష్టం జరగకుండా తీసుకున్న చర్యల వల్ల వేలాది మంది రైతులకు ఊరట లభించిందన్నారు. ఈ ఏడాది కూడా మామిడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా, పరిశ్రమలతో సమన్వయం ఉండేలా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రైతుల పేరుతో రాజకీయాలు చేసే వైసీపీ నేతలు, సోషల్ మీడియా ముఠాలు అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి నిబద్ధత ఉందని, వారి ప్రయోజనాలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మామిడి రైతులు ఎవరూ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.



# ట్రంప్‌కు వీసా దెబ్బ !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి ఎదురుగాలి వీస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని అమెరికా పౌరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇక ప్రపంచమంతా కూడా ట్రంప్ యుద్ధ పిపాసపై మండిపడుతోంది. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. ఇంధనం దొరక్క అనేక దేశాలు అల్లాడి పోతున్నాయి. ఈ తరుణంలో ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది. అలాగే ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంతన్నది కూడా చర్చిస్తున్నారు. అమెరికా హెచ్-1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యూఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. దీంతోపాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్-1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసారు. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్-1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే హెచ్-1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..! ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్-1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకునే వీలుంది. ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు. అయితే అనేక వివాదాస్పద నిర్ణయాలతో ట్రంప్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ వీసా నిబంధనల కారణంగా అమెరికాకు వచ్చే వృత్తి నిపుణులకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికా లోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ కి చెందిన చీఫ్ స్పందించారు. హెచ్-1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమని ఇక్కడి నిపుణులు అభిప్రయాపడ్డారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగుస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ప్రస్తావించారు. చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారుల కు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# విపక్షాలకు ఒకే మాట, ఒకే బాట ఏదీ?

ఢిల్లీలో సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో వాడిపోయిన ముఖంతో కనపడ్డ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గట్టిగా హత్తుకున్నారు. ఒక స్త్రీ మనసును మరో స్త్రీ తప్ప మరెవరు అర్థం చేసుకోగలరు? 'కొన్ని దృశ్యాలను మాటల్లో చెప్పలేం' అని సీనియర్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరు మహిళలను గతంలో అంతర్జాతీయ సంస్థలు దేశంలోనే అత్యంత శక్తిమంతమైన నేతలుగా అభివర్ణించాయి. సోనియా పది సంవత్సరాలకు పైగా దేశ రాజకీయాలను శాసిస్తే, మమతా బెనర్జీ 15 సంవత్సరాలు బెంగాల్ రాజకీయాలను శాసించారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని వారికి తెలియనిది కాదు. గత నెలలో వెలువడిన అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ వ్యతిరేక శక్తులు మళ్లీ ఢిల్లీలో సమావేశమయ్యాయి. నిన్నటి వరకూ తాము కాంగ్రెస్‌ను కూడా ఢీకొన్న విషయాన్ని మరిచిన మమతా బెనర్జీ, వామపక్షాలు జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై రాహుల్‌గాంధీ ఇటీవలే తనను తీవ్రంగా విమర్శించిన విషయాన్ని మమతా బెనర్జీ మరిచిపోయినట్లే కనపడుతోంది. 'దేశంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. ఇక జాతీయ స్థాయిలో నేనే కీలక పాత్ర పోషిస్తాను' అని 2021లో ప్రధానమంత్రి పదవి గురించి కలలు కన్న విషయం కూడా ఆమెకు ఇప్పుడు గుర్తుండే అవకాశాలు లేవు 1998లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి కోల్‌కతాలో ఏఐసీసీ ప్లీనరీ జరుగుతున్నప్పుడు ర్యాలీ నిర్వహించి పార్టీని ప్రకటించిన బెబ్బులి మమతా బెనర్జీ ఇప్పుడు కోరలు తీసేసినట్లే కనపడుతున్నారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో తృణమూల్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆమెపైనే తిరుగుబాటును ప్రకటించారు. ఆమె కుడిభుజం అభిషేక్ బెనర్జీ. ఎంపీ కల్యాణ్ బెనర్జీ తదితర తృణమూల్ నేతలపై వీధుల్లో దాడులు జరుగుతున్నాయి. మమత ఒకప్పుడు ప్రత్యర్థులపై అవలంబించిన విధానాలే ఇప్పుడు ఆమెపై ప్రత్యర్థులు ప్రయోగిస్తున్నారు. కోల్‌కతా వీధుల్లో ఇప్పుడు మమతా బెనర్జీ, ఆమె వర్గీయులు అరణ్య రోదన చేస్తుంటే వారికి అండగా ఇప్పుడు కాంగ్రెస్ నేతలే నిలిచే పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో అటు రాష్ట్రంలోనూ, ఇటు ఢిల్లీలోనూ బీజేపీ వంటి మహాశక్తిని ఎదుర్కోవాలంటే కాంగ్రెసే శరణ్యమని మమతా బెనర్జీ గ్రహించినట్లు కనపడుతోంది. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు సీట్లు పెద్దగా గెలుచుకోనప్పటికీ తృణమూల్‌ను బాగా దెబ్బతీయగలిగాయి. ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర్ దినాజ్‌పూర్ లాంటి మైనారిటీల ఆధిపత్యం ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్‌వామపక్ష కూటమి తృణమూల్‌కు సంప్రదాయంగా లభించే మద్దతు రాకుండా చూశాయి. 50శాతానికి పైగా ముస్లింల జనాభా ఉన్న 32 అసెంబ్లీ స్థానాల్లో తృణమూల్ ఒక్క సీటును కూడా గెలుచుకోలేదు. జంగీపూర్ అనే నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 31వేల ఓట్లు రాగా తృణమూల్ అభ్యర్థికి 10,542 ఓట్లు మాత్రమే లభించాయి. అదే కరండిఘి అనే నియోజకవర్గంలో సీపీఐ(ఎం)కు 39వేల ఓట్లు రాగా, ఆ పార్టీ అభ్యర్థిపై బీజేపీ అభ్యర్థి 20వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. బహుశా ఈ ఫలితాలు వచ్చిన తీరు మమతా బెనర్జీకి తన అహంకారం, దౌర్జన్యపూరిత ధోరణి, మిత్రపక్షాలను లెక్కచేయనితనం గురించి గుణపాఠాలు నేర్పే ఉంటుంది. అందుకే ఆమె ఇప్పుడు ఢిల్లీ వీధుల్లో కనపడుతున్నారు. ఇక దేశంలో తమ కాళ్ల కింద నేల క్రుంగిపోతున్న వామపక్షాలకు కూడా ఢిల్లీ వీధులే శరణ్యంగా మారాయి. 140 సీట్లున్న కేరళ అసెంబ్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 100 సీట్లకు పైగా గెలుచుకోవడం, బీజేపీ మూడు సీట్లు గెలుచుకోవడం, పినరయి విజయన్ కేబినెట్‌లో అత్యధిక మంత్రులు పరాజయం పాలుగావడం విస్మరించదగ్గ విషయం కాదు. అక్కడ కూడా పినరయి విజయన్ పదేళ్ల కేంద్రీకృత అహంకార పాలన, రైతులు, యువత, ఆశా వర్కర్ల తీవ్ర నిరుత్సాహానికి గురికావడం, పార్టీ కేడర్ అసంతృప్తి... వంటివి వామపక్ష కూటమి పరాజయానికి కారణమని విశ్లేషకులు అభివర్ణించారు. పినరయి విజయన్ బీజేపీతో కుమ్మక్కయ్యారని, అవినీతిపరులను ప్రోత్సహిస్తున్నారని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు విమర్శించారు. విజయన్‌పై కేంద్ర ఏజెన్సీలు ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. ఏమైతేనేం అయిదు దశాబ్దాల తర్వాత దేశంలో ఎక్కడా అధికారంలో లేని పరిస్థితికి వచ్చిన వామపక్షాలు బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేయడం తప్ప తమకు మరో మార్గం లేదని గ్రహించాయి. ఇండియా కూటమి సమావేశానికి హాజరైన వామపక్ష నేతలు డి.రాజా, జాన్ బ్రిటాస్‌కు ఆ స్పష్టత ఉన్నది. దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితిని రెండేళ్ల క్రితం మరణించిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి బాగా అర్థం చేసుకున్నారు. సీపీఐ(ఎం) బహిష్కరించిన ప్రసేనజిత్ బోస్‌ను కాంగ్రెస్ తన పార్టీలో చేర్చుకున్నప్పుడు 'మీ కామ్రేడ్‌ను మేము మా పార్టీలో చేర్చుకున్నాం' అని రాహుల్‌గాంధీ ఏచూరితో పరిహాసమాడారు. 'మీ వాడు, మా వాడు అనేది ఏముంది, ఈ పోరులో మనమిద్దరమూ ఒకే పడవలో ప్రయాణిస్తున్నాం' అని ఏచూరి నవ్వుతూ జవాబిచ్చారు. దేశంలో బీజేపీ అడ్డూ ఆపూ లేకుండా దూసుకువస్తున్న పరిస్థితుల్లో ఆ పార్టీని ఎదుర్కొనేందుకు అన్ని బీజేపీ వ్యతిరేక శక్తులూ సంకుచిత ధోరణి వీడి కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన ఎప్పుడో గ్రహించారు. ఇవాళ ఎన్డీఏలో ఉన్న పార్టీలేవీ ఎన్నికల్లో పరస్పరం పోటీపడడం లేదు. కానీ ఇండియా కూటమిలో ఉన్న పార్టీలకు ఆ మేరకు సమైక్యత లేదు. దాదాపు రెండేళ్ల తర్వాత ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన 23 పార్టీలకు ఎంత మేరకు లక్ష్యశుద్ధి ఉన్నది? డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీలు హాజరు కాకపోవడంలో మర్మం ఏమిటి? ఎమర్జెన్సీ అనంతరం 1977లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఒకే ఎన్నికల గుర్తుపై జనతా పార్టీ పేరుతో పోటీ చేశాయి. అప్పటి చిత్తశుద్ధి, పోరాట స్ఫూర్తి ఇప్పుడు ఎన్ని పార్టీలకు ఉంది? మిత్రపక్షాలను కూడా తన సైద్ధాంతిక బాటలో నడిపించగలిగిన బీజేపీ మాదిరి కాంగ్రెస్ ఇతర పార్టీలకు సారథ్యం వహించగలదా? ఇండియా కూటమి సమావేశం జరిగిన రెండు రోజుల తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశాన్ని ఏర్పరిచారు. పేరుకు ఇది ఎన్డీఏ సమావేశమైనా, జరుగుతోంది బీజేపీ సమావేశమే. నాగాలాండ్, మేఘాలయ, పుదుచ్చేరి వంటి చిన్న రాష్ట్రాలను పక్కన పెడితే ఎన్డీఏ పాలన అమలులో ఉన్న అతి పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. నిన్నమొన్నటి వరకు బిహార్‌లో జనతాదళ్(యు) అధినేత నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఇప్పుడు అక్కడ కూడా బీజేపీ నేతే ముఖ్యమంత్రిగా ఉన్నారు. నితీశ్ రాజ్యసభకు రావడంతో లోక్‌సభలో ఉన్న 12 మంది జేడీ(యు) ఎంపీలకు మోదీయే నాయకుడుగా భావించవలసి ఉంటుంది. లోక్‌సభలో 28 మంది తృణమూల్ ఎంపీలు ఉండగా, ఆ పార్టీ చీఫ్ విప్ కాకోలీ ఘోష్ దస్తిదార్ నేతృత్వంలోని 20 మంది ఎంపీలు మమతా బెనర్జీపై తిరుగుబాటు చేసి తమను ప్రత్యేక గ్రూప్‌గా గుర్తించమని స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని నిర్ణయించారు. వీరు కూడా ఏ సుముహూర్తాన్నో బీజేపీలో చేరి, ఆ పార్టీ ఎంపీలుగా కాషాయ కండువా కప్పుకోక తప్పదు. అంటే బీజేపీకి తెలుగుదేశం ప్రమేయం లేకుండానే ఇప్పటికే లోక్‌సభలో పూర్తి మెజారిటీ వచ్చినట్లే లెక్క.అంతేకాక శివసేనకు చెందిన ఏడుగురు, లోక్ జనశక్తికి చెందిన అయిదుగురు, జనతాదళ్ సెక్యులర్‌కు చెందిన ఇద్దరు, రాష్ట్రీయ లోక్‌దళ్‌కు చెందిన ఇద్దరు, ఎన్సీపీ పవార్ గ్రూప్‌కు చెందిన ఒక్కరు, అప్నాదళ్, హిందూస్థానీ ఆవామీ మోర్చాకు చెందిన ఇద్దరితో పాటు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ఆరుగురు ఇప్పటికే బీజేపీకి మద్దతునిస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక శివసేన, ఎన్సీపీ, లోక్ జనశక్తి, రాష్ట్రీయ లోక సమతా పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ వంటి పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన ఘనత, పలువురు ఇతర పార్టీల నేతలను తమతో పాటు కలుపుకున్న ఘనత భారతీయ జనతా పార్టీకి దక్కింది. అంతే కాదు, మోదీ హయాంలోనే బీఎస్పీ, బీజేడీ, అన్నాడీఎంకేతో పాటు పలు ప్రాంతీయ పార్టీల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. మోదీకి దాసోహం అనకపోతే తమ మనుగడ కష్టమని పలు ప్రాంతీయ పార్టీలు భావించే పరిస్థితి దేశంలో నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన నేడు 13వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న దృష్ట్యా ఆయన రాజకీయాలు ఇంకెంత తీవ్ర స్థాయిలో ఉంటాయో అన్న విషయమై సోషల్ మీడియాలో వ్యాఖ్యలు, కాక్రోచ్ జనతా పార్టీ వంటి పరిణామాలు, ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడడం, న్యాయవ్యవస్థ లొంగిపోయిందనే ఆరోపణలు, నీట్, సీబీఎస్ఈ వంటి సంస్థలు పరీక్షలను నిర్వహించలేని వైఫల్యంపై ఎన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ రాజకీయంగా మోదీ బలం రోజురోజుకూ పెరుగుతోందనే విషయాన్ని ఎవరూ కాదనలేరు. అంతర్వైరుధ్యాలను తొలగించుకోకుండా, సమాన ప్రత్యామ్నాయ దృక్పథాన్ని ఏర్పర్చుకోకుండా ఎన్ని సమావేశాలు నిర్వహించినప్పటికీ ప్రతిపక్షాలు కానీ, ఇతరేతర శక్తులు కానీ ఏ మార్పును సాధించగలుగుతాయి?

## వీణా విజయన్‌కు ఇడి నోటీసులు

సీఎమ్ఆర్ఎల్-ఎక్సాలాజిక్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్ కేసుకు సంబంధించి 'ది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూతురు వీణా విజయన్‌కు సమన్లు జారీ చేసింది. జూన్ 12వ తేదీన శుక్రవారం కొచ్చిలోని ఆఫీస్‌లో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. వీణా విజయన్‌తో పాటు 9మందికి ఈడీ సమన్లు జారీ చేసింది. పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు చెందిన ఐటీ కన్సల్టెన్సీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. ప్రైవేట్ మైనింగ్ కంపెనీ అయిన సీఎమ్ఆర్ఎల్‌తో ఓ ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం కింద సీఎమ్ఆర్ఎల్ కంపెనీ.. వీణా విజయన్ కంపెనీకి 1.72 కోట్ల రూపాయల నుంచి 2.78 కోట్ల రూపాయల వరకు చెల్లించింది. అయితే, ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి ఎలాంటి ఐటీ సేవలు అందించకుండానే ఈ మొత్తాన్ని చెల్లించినట్లు దర్యాప్తులో తేలింది.

## హైదరాబాద్ లో కురిసిన భారీ వర్షంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన : మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ లో సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్, సిటీ పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్కువ సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వరకు వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. నగరంలోని ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపడిన ఘటనలపై మంత్రి ఆరా తీశారు. విద్యుత్ షాక్ తో ఇద్దరు వ్యక్తులు మరణించారని తెలుసుకున్న సమాచారంతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూలిన చెట్లు, తెగిన విద్యుత్ తీగలు తొలగించడానికి సహాయక చర్యలను వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ, హైడ్రా, పోలీస్, విద్యుత్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి
### : డా. :పుట్ల శ్రీనివాస్
### వైద్యాధికారులు,సిబ్బంది సమయపాలన పాటిస్తూ వైద్య సేవలో అలసత్వం చేయకూడదు



జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం హైదరాబాద్ సమావేశమందిరంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, కార్యాలయ అధికారులు, సిబ్బంది తో సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ హైదరాబాద్ జిల్లా లో ప్రతి ఒక్కరికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. ప్రజలకు సేవలు అందించడంలో అలసత్వం వహించకూడదు అని కోరారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కోరారు. ఈ కార్యాలయం లో ఫైల్స్ క్లియరెన్స్ సకాలంలో పూర్తి చేయాలని, పెండింగ్ ఉంచకూడదని కోరారు. జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలు, పథకాలు, ఆరోగ్య సేవలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసరూ డా, శ్రీదర్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్,కార్య లయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మైనారిటీ సంక్షేమ శాఖ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా ప్రారంభించిన మంత్రులు




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నాంపల్లి లోని రెడ్ రోజ్ గార్డెన్ లో మైనారిటీ సంక్షేమ శాఖ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా ప్రారంభించిన హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మైనార్టీ గురుకుల వైస్ చైర్మన్ ఫహీముద్దీన్ ఖురేషీ, మైనార్టీ వెల్ఫేర్ సెక్రటరీ బి.షఫీఉల్లా, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహిర్ బిన్ హందాన్, తదుతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళా ఒక చారిత్రాత్మక కార్యక్రమం అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ లో ఈ తరహా జాబ్ మేళా నిర్వహించడం ఇదే మొదటిసారి అని, రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహించబడాలి అని, ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలోని మైనారిటీ సోదర సోదరీమణులకు సరైన ఉపాధి అవకాశాలు లభించి, వారి జీవితాలు సంతోషంగా మరియు ఆర్థికంగా స్థిరంగా ఉండాలని కోరుకుంటున్నాను. మైనారిటీ యువతకు ఉపాధి కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు వెలుగు నింపే దిశగా ఇది ఒక మంచి ప్రారంభం. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, మైనారిటీ సంక్షేమ శాఖ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన అందరి సహకారంతో ఈ ప్రయత్నం భవిష్యత్తులో మరింత విస్తరించాలని ఆశిస్తున్నాను. హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో కాకుండా పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాల్లో ఉద్యోగ మేళాలను నిర్వహించి మరింత మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాము. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులందరికీ నా హృదయపూర్వక అభినందనలు, ఎంపిక కాలేని వారు నిరుత్సాహపడకుండా మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి అని, రాబోయే రోజుల్లో నిర్వహించే ఉద్యోగ మేళాల్లో కూడా మీకు మంచి అవకాశాలు లభిస్తాయని ఆశిస్తున్నాను. తెలంగాణలోని నిరుద్యోగ మైనారిటీ యువతకు ఇలాంటి మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహించి, వారికి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాలు కల్పించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధి కోసం ఎదురుచూస్తున్న అనేక మంది యువతకు ఈ కార్యక్రమం ఒక ఆశాకిరణంగా మారాలని, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మైనారిటీ సంక్షేమ శాఖకు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు, సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com